ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

శ్రీ పొట్టిశ్రీరాములు

నెల్లూరు

జిల్లా వార్తలు


సోమవారం 14 ఏప్రిల్ 2025

ఉష్ణోగ్రత వివరాలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
నెల్లూరు	38.9	29.5
కావలి	37	28
ఆత్మకూరు	39	28
ఉదయగిరి	39	26
కందుకూరు	38	28

జై భజరంగభళీ..!!

వైభవంగా హనుమాన్ శోభాయాత్ర ● కాషాయ జెండాలతో బైక్ ర్యాలీ





జై శ్రీరామ్... జై హనుమాన్.. జై భజరంగభళీ నినాదాలతో ఆదివారం సాయంత్రం నెల్లూరు నగరం మారుమోగింది. నగరంలో హనుమాన్ శోభాయాత్ర వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన బైక్ ర్యాలీలో పెద్ద సంఖ్యలో హిందువులు కాషాయ జెండాలు చేపట్టి ఉత్సాహంగా పాల్గొన్నారు. ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం నుంచి తడికల బజార్‌లోని ఆర్ఎస్ఆర్ఎం పాఠశాల వరకు ర్యాలీ సాగింది. శ్రీరాముడు, హనుమంతుని విగ్రహాలు యాత్రలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నగరంతోపాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి కూడా భక్తులు ర్యాలీకి తరలివచ్చారు. ఈ సందర్భంగా హిందూ చైతన్య వేదిక రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ హనుమంతుడు లంక దహనం అనంతరం సముద్రంలో దూకి పునరుజ్జీవం పొందిన రోజును హనుమ విజయోత్సవంగా జరుపుకుంటామని చెప్పారు. హనుమంతుని వ్యక్తిత్వాన్ని, ధీరత్వాన్ని, సమయస్ఫూర్తిని, కార్యదక్షతను యువతలో పెంపొందించాలనే ఉద్దేశంతో ప్రతి సంవత్సరం హనుమ భక్త శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ ర్యాలీలో రాజకీయ పార్టీలు, కులాలకు అతీతంగా అందరూ పాల్గొంటారని తెలియజేశారు. హిందూ చైతన్య వేదిక రాష్ట్ర సహ అధ్యక్షుడు కోడూరు జయరాం, రాష్ట్ర న్యాయవాద విభాగం అధ్యక్షుడు నేలపాటి నాగశ్రీనివాస్, రాష్ట్ర కో ఆర్డినేటర్ పీజీ మహేష్, రాష్ట్ర ప్రచార విభాగం అధ్యక్షుడు కాకు మురళీరెడ్డి, జిల్లా నాయకులు టీ సాయిశ్రీనివాస్, ఆచ్చి రామాంజనేయులు, సోలేటి వెంకటేశ్వర్లు, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, ఈ కార్యక్రమం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

- నెల్లూరు (సాంస్కృతికం,ఆంధ్రజ్యోతి)

'ఆరోగ్యశ్రీ'లో 'ఆసరా' అందనంటోంది!

ఆర్నెళ్లుగా రోగులకు అందని నగదు

జిల్లాలో రూ.6 కోట్ల వరకు బకాయిలు

మే నుంచి అందజేస్తామంటున్న అధికారులు

నెల్లూరు (వైద్యం), ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ వైద్యసేవ పథకం ద్వారా శస్త్రచికిత్సలు చేయించుకుని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటూ వైద్యసేవలు పొందుతున్న వ్యాధిగ్రస్థులకు 'ఆసరా' అందనంటోంది. వారు నెలలుగా బకాయిలు పేరుకుపోవడంతో బాధితులు గగ్గోలు పెడుతున్నారు. 2019 డిసెంబరు 1వ తేదీన అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆరోగ్య ఆసరా పథకాన్ని ప్రవేశపెట్టారు. ప్రతి ఏడాది 24 వేలకుపైగా ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులలో శస్త్రచికిత్సలు జరుగుతుంటాయి. శస్త్రచికిత్సల అనంతరం విశ్రాంతి సమయంలో వైద్య చికిత్సలలో మందులతోపాటు ఇతర ఆదాయ వనరుల కింద నెలకు సరాసరి రూ.5వేల వరకు ఆర్థికసాయం అందుతుంది. అలాగే, కాళ్లు, చేతులు విరిగిన వారు మూడు నెలలు ఇంట్లోనే విశ్రాంతి తీసుకోవాల్సి ఉంటుంది. అలాంటి వారికి వైఎస్సార్ ఆరోగ్య ఆసరా పథకం ద్వారా రూ.15 వేల వంతున అందిస్తున్నారు. కేన్సర్ రోగులకు మెడికల్ మేనేజ్‌మెంట్ కింద 180 రోజులకు రూ.30వేలు, క్రిటికల్ చర్మవ్యాధులకు ఏడాదికి రూ.60వేల వంతన ఆసరా పథకం నిధులు రోగులకు అందిస్తున్నారు. ఈ లెక్కన గతేడాది అక్టోబరు నుంచి 6 నెలలకుగాను రోగులకు రూ.6 కోట్ల వరకు బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఎన్డీఏ కూటమి రాష్ట్రంలో అధికారం చేపట్టాక మొదటి నాలుగు నెలలు ఆసరా కింద బాధితులను ఆదుకుంది. ఆ తర్వాత నిధులు విడుదల చేయకపోవటంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లావ్యాప్తంగా 132 నెట్‌వర్క్ ఆసుపత్రులు ఉండగా ఇందులో 35 ప్రైవేట్ నెట్‌వర్క్ ఆసుపత్రులు, 31 డెంటల్ ఆసుపత్రులు, 52 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 10 సామాజిక ఆసుపత్రులు, కావలి, కందుకూరు ఏరియా ఆసుపత్రులు, ఆత్మకూరు జిల్లా ఆసుపత్రితోపాటు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఉన్నాయి. ఇందులో ఆరోగ్యశ్రీ కింద జరుగుతున్న రోగులకు ఆసరా అందని ద్రాక్షలా మిగులుతోంది.

త్వరలో నిధులు వస్తాయి



ఆరోగ్యశ్రీ రోగులు డిశ్చార్జ్ అయిన వెంటనే ఆసరా నిధులు వారి బ్యాంకు ఖాతాలో జమ అయ్యేవి. అయితే ఇటీవల ఆ నిధులు రాక పోవటంతో రోగుల నుంచి కూడా ఒత్తిడి ఎక్కువైంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా రోగులకు ఆసరా కింద నగదు అందించేందుకు కసరత్తు చేస్తోంది. వచ్చే నెల మే నుంచి రోగులకు డబ్బులు అందించే వీలు ఉంటుంది. 6 నెలల బకాయిలు కూడా అప్పుడే అందజేస్తారు.

- డాక్టర్ సుధీర్‌కుమార్, ఎన్టీఆర్ వైద్యసేవ పథకం జిల్లా కో ఆర్డినేటర్

గాలివాన బీభత్సం

● విరిగిన పడిన చెట్ల కొమ్మలు, ఫ్లెక్సీలు ● పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం

● పండ్ల తోటల రైతులకు నష్టం



కందుకూరు బస్టాండ్ సెంటర్‌లో విరిగిపడిన చెట్ల కొమ్మలను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

కందుకూరు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా అక్కడక్కడా ఆదివారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. ఒక్కసారిగా దట్టమైన మేఘాలు ఆవహించి, వెంటనే పెనుగాలులు వీచాయి. చిరుజల్లులకే వర్షం పరిమితం కాగా గాలితో ప్రజలు గందరగోళానికి గురయ్యారు. గాలిప్రభావంతో మోటారుసైకిళ్లు కిందపడిపోయి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. కందుకూరులోని అనేక ప్రాంతాలలో చెట్లకొమ్మలు విరిగిపడి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని భావిస్తున్నారు. కందుకూరు ప్రాంతంలో ప్రస్తుతం నువ్వు కోతలు, నూర్పిళ్లు, మిర్చి ఆఖరికోతలు జరుగుతున్నాయి. కల్లాలో ఉన్న నువ్వుకువ్వలు నేలపాలయ్యాయని రైతులు వాపోతున్నారు. అలాగే పలుచోట్ల మిర్చికి కూడా నష్టం జరిగి ఉంటుందని భావిస్తున్నారు.

● **నేలకొరిగిన ఫ్లెక్సీలు**

కావలి : పట్టణంలో ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై చీకట్లు కమ్ముకుని ఎర్రదుమ్మురేపుతూ గాలులు వీచాయి. దీంతో ఫ్లెక్సీలు రోడ్లపై పడి పోవటంతో ప్రజలు తీవ్ర అసౌకర్యాలకు గురయ్యారు. స్థానిక పొట్టి శ్రీరాములు విగ్రహం సెంటర్‌లో కట్టిన ఓ ఫ్లెక్సీ రోడ్డుపై వెళుతున్న ఆటోపై పడింది. అయితే ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

● **ఉదయగిరి రూరల్** : ఉదయగిరి, వరికుంటపాడు మండలాల్లోని పలు గ్రామాల్లో ఆదివారం ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. ఈదురుగాలులకు ద్విచక్ర వాహనదారులు దుమ్ముధూళితో నిండిపోవాల్సి వచ్చింది. అలాగే విద్యుత్ సరఫరాలోనూ అంతరాయం ఏర్పడింది.

● **దుత్తలూరు (ఉదయగిరి)** : మండలంలోని పలు గ్రామాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన ఓ మోస్తరు వర్షం కురిసింది. ఈదురు గాలులతో పండ్లతోటల రైతులు తీవ్రంగా నష్టపోవాల్సివచ్చింది.

● **బుచ్చిరెడ్డిపాళెం** : మండలంలో ఆదివారం సాయంత్రం ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. పట్టణంలో ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు ఊడి కింద పడిపోయాయి.



కావలిలో ఆటోపై పడిన ఫ్లెక్సీ



నెల్లూరులో ఈదురుగాలులు



తూపిలిపాళెం తీరంలో పడవను ఒడ్డుకు చేర్చుతున్న మత్స్యకారులు

రేపటి నుంచి వేట నిషేధం

2నెలలపాటు కడలిలోకి మత్స్యకారులకు నో ఎంట్రీ! ● వేట విరామభృతి రూ.20వేలకు పెంపు

12,440 కుటుంబాలను గుర్తించిన అధికారులు ● త్వరలో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమ

కావలి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : సముద్రంలో చేపలు గుడ్లు పెట్టే సీజన్ కావడంతో మంగళవారం నుంచి జూన్ 14వ తేదీ వరకు వేట నిషేధం కొనసాగనుంది. 60 రోజులపాటు మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లకుండా రాష్ట్ర ప్రభుత్వం నిషేధం విధించింది. వేట విరామ సమయంలో మత్స్యకార కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు పడకుండా భృతిని అందజేయనుంది. జిల్లావ్యాప్తంగా వేటపై ఆధారపడి జీవించే మత్స్యకార కుటుంబాలు 12,440 ఉన్నట్లు అధికారులు గుర్తించారు. గత వైసీపీ హయాంలో భృతి కింద రూ.10 వేలు ఇస్తూ అది కూడా వివిధ కొర్రీలతో అందరికీ ఇవ్వకుండా అప్పటిపాలకులు ఇబ్బంది పెట్టారు. అయితే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం వేట విరామ భృతిని రూ.20 వేలకు పెంచడంతో మత్స్యకారుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఈ మేరకు జిల్లాకు రూ.24.88 కోట్లు రానున్నాయి. మత్స్య శాఖ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపడంతో అతిత్వరలోనే ఆ నిధులు కూడా మత్స్యకారుల బ్యాంకు ఖాతాలలో జమకానున్నాయి.

● **భృతి అందేదెప్పుడు!?**

వేట విరామం ప్రారంభమైనప్పటి నుంచి మత్స్యకారులకు జీవనోపాధి కష్టతరంగా ఉంటుంది. దీంతో ప్రభుత్వం అందించే భృతి కోసం మత్స్యకారులు ఎదురు చూస్తుంటారు. గత ప్రభుత్వం సక్రమంగా ఇవ్వకపోవటంతో ఈ ప్రభుత్వంలోనైనా అర్హులందరికీ అందుతుందా లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో సుమారు 18 వేల మత్స్యకార కుటుంబాలు ఉండగా వారిలో వివిధ పథకాలు పొందే వారు కాకుండా కేవలం సముద్ర వేటపైనే ఆధారపడి జీవించే వారిని ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ అయిన బోట్ల ద్వారా 12,440 కుటుంబాలను గుర్తించారు. మత్స్యకార కుటుంబాలలో పెన్షన్, ఇతరత్రా ప్రభుత్వ పథకాలు పొందని ఆన్‌లైన బోట్ల రిజిస్ట్రేషన్ అయిన మత్స్యకారులను మాత్రమే వేట విరామ భృతికి అర్హులుగా ప్రభుత్వం గుర్తించింది.

అందరికీ భృతి ఇవ్వాలి



అర్హులైన ప్రతి మత్స్యకారుడికి వేట విరామం అందచేయాలి. గత ప్రభుత్వంలో 20 శాతం మందికి మాత్రమే ఇవ్వడంతో ఆ ప్రభుత్వంపై మత్స్యకారులలో వ్యతిరేకత వచ్చింది. ఈ ప్రభుత్వం రూ.20వేలు పెంచటం హర్షణీయమైనా కొర్రీలు పెట్టకుండా అందరికీ ఇచ్చినప్పుడే న్యాయం జరుగుతోంది.

- వాయిళ్ల శ్రీనుబాబు, మత్స్యకారసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు

టీడీపీలోనే నగదు రూపేణా భృతి



గత కాంగ్రెస్ ప్రభుత్వంలో వేట విరామం భృతి కింద కేవలం బియ్యం మాత్రమే ఇచ్చేవారు. టీడీపీ ప్రభుత్వంలోనే వేటవిరామం కింద నగదు ఇవ్వడం ప్రారంబించారు. రూ.20 వేలు కూడా టీడీపీ ప్రభుత్వమే పెంచింది. అయితే ఆ భృతిని అర్హులైన ప్రతి మత్స్యకారుడికి అందజేస్తే జీవనోపాధికి సరిపోతుంది.

- బుచ్చింగారి బాబు, మత్స్యకారుడు, ఇస్కపల్లి



పడవలను ఒడ్డుకు చేర్చుకుని వలలను జాగ్రత్త పరుచుకుంటున్న మత్స్యకారులు

రీసర్వే చేసి ఇస్తేనే న్యాయం



రీసర్వే చేయకుండా గత ప్రభుత్వం రూపొందించిన జాబితా ప్రకారం భృతి ఇవ్వాలనుకోవ డం సరికాదు. గత వైసీపీ ప్రభుత్వంలో నాయకుల అనుచరులకు తప్ప మిగతావారికి భృతి ఇవ్వలేదు. రీసర్వే చేసి అర్హులందరికీ ఇవ్వాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. పాత జాబితా ప్రకారం ఇస్తే అర్హులకు అన్యాయం జరిగే అవకాశాలు ఉన్నాయి.

- సోమయ్యగారి రమణ, రామచంద్రాపురం

తీర ప్రాంతం : 104 కి.మీ | మండలాలు : ఉలవపాడు, కావలి రూరల్, అల్లూరు, బోగోలు, కొడవలూరు, విడవలూరు, టీపీగూడూరు, ఇందుకూరుపేట, ముత్తుకూరు | వేట నిషేధ సమయం : ఏప్రిల్ 14 నుంచి జూన్ 14 వరకు | మత్స్యకార కుటుంబాలు : 18వేలు | గుర్తించినవి : 12,440 | జిల్లాకు అందే నిధులు : రూ.24.88 కోట్లు

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	117
స్కిన్ చికెన్	210
స్కిన్‌లెస్	232

కోడిగుడ్ల ధర (100): 420

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9033
వెండి కిలో ధర	రూ. 98,000
వెండి ఒక గ్రాము	రూ.101.00

తగ్గిన మిర్చి ధర : ఆందోళనలో రైతులు

అనంతసాగరం ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మిర్చి ధర తగ్గుముఖం పట్టడంతో రైతులు లబోదిబోమంటున్నారు. మనుము రూ.170లు పలుకుతుండడంతో అన్నదాతలు నష్టపోతున్నారు. గత నెలలో రూ.250ల వరకు ధర పలుకగా వ్యాపారులు అవసరాలకు అనుగుణంగా ధరను తగ్గిస్తుండంతో, రైతులు పెట్టిన పెట్టుబడులు రాక ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని సంజీవనగరం, గౌరవరం, అగ్రహారం, బొమ్మవరం తదితర గ్రామాల్లో మిరప సాగు చేపట్టారు. కొన్ని చోట్ల వైరస్ సోకి పంట దెబ్బతినగా, వేలకు వేలు ఖర్చు పెట్టి పంటను కాపాడుకుంటే నేడు దిగుబడికి ధర లేదని రైతులు వాపోతున్నారు.

నిర్మాణం పూర్తయి రెండేళ్లు

● ప్రారంభానికి నోచని వసతిగృహం ● అగచాట్లు పడుతున్న ఆదర్శ పాఠశాల విద్యార్థినులు

లింగసముద్రం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : గ్రామ ప్రాంతాల్లోని విద్యార్థినులకు ఆంగ్ల మాధ్యమంలో విద్యా బోధన అందించి, వారిని ఉన్నత స్థానాలకు చేర్చేందుకు కేంద్రం ఏర్పాటు చేసిన ఆదర్శ పాఠశాలలకు అనుబంధంగా వసతి గృహాలు నిర్మించారు. ఇందులో భాగంగా మండలంలోని తిమ్మారెడ్డిపాలెంలోని ఆదర్శ పాఠశాల ఆవరణలో ఆర్ఎంఎస్ఏ పథకం కింద రూ.28.81 లక్షలతో బాలికల కోసం వసతి గృహాన్ని నిర్మించారు. ఈ భవనం 2023 జూన్‌లోనే నిర్మాణ పూర్తయింది. కానీ ప్రారంభానికి నోచుకోలేదు.ఈ వసతిగృహంలో సిబ్బందిని నియమించలేదు. వంట పాత్రలు పంపించలేదు. బాలికల కోసం మంచాలు కూడా ఏర్పాటు చేయలేదు.ఈ కారణాలతో ఈ వసతి గృహాన్ని ప్రారంభించలేదు.దీంతో బాలికలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.


తిమ్మారెడ్డిపాలెం ఏపీ మోడల్ స్కూల్లో పూర్తయిన బాలికల వసతి గృహం

● పెరగని బాలికల సంఖ్య

వసతి గృహం ప్రారంభం కాకపోవడంతో ఆదర్శ పాఠశాలలో విద్యార్థినుల సంఖ్య పెరగడం లేదు.ప్రస్తుతం పాఠశాలలో ఆరు నుంచి సీనియర్ ఇంటర్ వరకు 260 మంది బాలికలు చదువుతున్నారు.అయితే వీరిలో ఎక్కువగా లింగసముద్రం, ఎర్రారెడ్డిపాలెం, పెంట్రాల, ఆర్ఆర్ పాలెం, మొగిలిచెర్ల, గంగపాలెం, మాలకొండరాయునిపాలెం, విశ్వనాధపురం తదితర గ్రామాలకు చెందిన వారు ఉన్నారు. వీరంతా సుమారు 5 నుంచి 15 కి.మీ దూరం నుంచి వస్తుంటారు. బస్సులు, సైకిళ్లు, ఇతర వాహనాలలో వచ్చి చదువుతుంటారు.అయితే ఈ వసతి గృహాన్ని ప్రారంభిస్తే ఈ పాఠశాలలో చేరే విద్యార్థినుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని విద్యార్థినుల తల్లిదండ్రులు అంటున్నారు.

అంబేడ్కర్‌కు నేతల నివాళులు


కందుకూరు : అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాల ఉద్యోగుల సంఘం నేతలు తదితరులు

కందుకూరు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ జయంతి సందర్భంగా దళితనేత కట్టా వెంకటనారాయణ జ్ఞాపకార్థం పట్టణంలో రెండువారాలుగా నిర్వహిస్తున్న నివాళుల కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం మాల ఉద్యోగుల సంఘం, వివిధ దళితసంఘాల నేతలు అంబేడ్కర్‌కు ఘనంగా నివాళులు నిర్వహించారు. కార్యక్రమంలో మాల ఉద్యోగుల సంఘం, మాలసంఘాల జేఏసీ అధ్యక్షుడు టీ. అశోక్, జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పాలేటి కోటేశ్వరరావు, మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు కొప్పోలు ఏడుకొండలు, వివిధ సంఘాల నాయకులు కట్టా సుచరిత, వై. మల్లికార్జున, వై. జనార్దన్, బీ. గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

● స్మృతివనాన్ని పీ-4కి అప్పగించవద్దు

విజయవాడ స్వరాజ్య మైదానంలో ఏర్పాటుచేసిన అంబేడ్కర్ స్మృతివనాన్ని పీ4 పద్ధతిలో కార్పొరేట్ వ్యక్తులకు అప్పగించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టరు లక్ష్మీషా ప్రకటించటం దురదృష్టకరమని బ్యాంకు అధికారుల సంఘం మాజీ నేత, దళితసంఘాల రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పాలేటి కోటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పీ-4 పద్ధతిలో కార్పొరేట్ వ్యక్తులకు అప్పగిస్తే అది వ్యాపారకేంద్రంగా మారుతుందని పేర్కొన్నారు.

● బిట్రగుంట, (ఆంధ్రజ్యోతి): బోగోలు పాత దళితవాడలోని రీడింగ్‌రూమ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం జరిగే జయంతి ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు చేశారు. కడనూతల దళితవాడ ప్రాథమిక పాఠశాల వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహాన్ని రంగులతో ముస్తాబు చేశారు. రామస్వామిపాలెం జైభీం అంబేడ్కర్ క్రీడామైదానంలో విద్యుత్ దీపాలంకరణ చేశారు. అంబేడ్కర్ సందర్భంగా మూడురోజులపాటు మండలస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నారు.

ఊరూరా ఉత్సాహంగా మట్టల ఆదివారం


కందుకూరులో జరిగిన మట్టల ఆదివారం కార్యక్రమంలో పాల్గొన్న క్రైస్తవులు


బిట్రగుంట : ఈత మట్టలతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



ఉదయగిరి : ఈతమట్టలతో ర్యాలీగా చర్చికి వెళ్తున్న క్రైస్తవులు

కందుకూరు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలో క్రైస్తవులు మట్టల ఆదివారం కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. వివిధ చర్చిల్లో ఈ కార్యక్రమాన్ని తమ సాంప్రదాయ పద్ధతిలో నిర్వహించారు. సంతోష్‌నగర్‌లోని విలియంకేరి తెలుగుబాప్టిస్ట్ టౌన్‌చర్చి ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ జరిపారు. చిన్నారులు, పెద్దలు మట్టలను చేతపట్టుకుని ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో పాస్టర్ ఏ. ప్రతాప్, చైర్మన్ చదలవాడ నాగభూషణం, సెక్రటరీ సహజానందం, జయరావు, కోటేశ్వరరావు, పీటర్, నాగరాజు, సింగయ్య, మెర్సీమహిత తదితరులు పాల్గొన్నారు.

● బిట్రగుంట (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలోని పలు క్రైస్తవ మందిరాల్లో ఆదివారం ఉదయం మట్టలాదివారపు వేడుకలు జరిగాయి. సండేస్కూల్ పిల్లలు ఈత, టెంకాయి, క్రోటన్ మట్టలకు పూలను గుచ్చి పురవీధులో యూదులరాజ హోసన్న దావీదు తనయ్య హోసన్న అంటుపాటలు పాడుతూ ర్యాలీ నిర్వహించారు. బోగోలో పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రెవ. డా శ్యాంసన్‌బాబు సండేస్కూల్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అలాగే హోలీ ఫ్యామిలీ చర్చి ఫాదర్ బీ.పాల్, కడనూతలో పాస్టర్ రెవ. సీహెచ్.నాగరాజు సంఘస్తులతో ర్యాలీ చేశారు. విశ్వనాథరావుపేట, రామస్వామిపాలెం, తిప్ప బాడన్‌పేట, చెన్నారెడ్డిపాలెం, తాళ్ళూరు తదితర గ్రామాలో మట్టలాదివారపు ర్యాలీ, ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి.

● అనంతసాగరం (ఆంధ్రజ్యోతి): స్థానిక సెంటనరి తెలుగు బాపిస్టు, సోమశిలలోని క్రిస్తు సంఘం చర్చిలో ఆదివారం మట్టల పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా యేసు ప్రభు చేసిన మహిమలు వివరిస్తూ వీధుల్లో సువార్త గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో పాస్టర్ రాజ్‌కుమార్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

● ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి): ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం పట్టణంలో పలు చర్చిల క్రైస్తవులు ఈతమట్టల పండుగను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఈస్టర్‌కు ముందు ఏసుప్రభువు జెరూసలెంలో ప్రవేశించిన సందర్భంగా అక్కడి ప్రజలు ఆయనకు తాటి, ఈతమట్టలతో స్వాగతం పలికారని, ఈ రోజు ఈతమట్టల పండుగ జరుపుకోవడం ఆనవాయితీ అన్నారు. అనంతరం చర్చిలో పాస్టర్లు ఆదివారం మట్టల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో క్రైస్తవ మతపెద్దలు ప్రసాదరావు, బకీరు జాషువా, సుధీర్‌కుమార్, జక్కరయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చెన్నకేశవుడి కల్యాణం

వింజమూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఎర్రబెల్లిపాలెంలో వెలసి ఉన్న శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి కల్యాణ మహోత్సవం ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. బాణసంచాల వేడుకల మధ్య స్వామివారిని శివాలయం దగ్గర ఉన్న మండపంపైకి తీసుకువచ్చి వేదమంత్రోచ్చరణలతో కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సేవా కార్యక్రమాల్లో ఎర్రబెల్లిపాలెం యూత్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం స్వామివారిని గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త గణపం సుదర్శన్‌రెడ్డి, ఈవో శాంతయ్య తదితరుల పర్యవేక్షణలో నిర్వహించారు.


కల్యాణానికి సిద్ధమైన శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి

సీతారామపురం మండలంలో అభివృద్ధి పనులకు భూమి పూజ

సీతారామపురం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని పలు గ్రామాల్లో రూ.35లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి ఆదివారం భూమి పూజ చేశారు. ఆమె మాట్లాడుతూ జనరల్ ఫండ్ నిధులతో సంజీ వరెడ్డి నగర్‌లో రూ. 10 లక్షలు, బాలాయపల్లిలో రూ. 10 లక్షలు, బెడుసుపల్లిలో రూ.5లక్షలు, మారంరెడ్డిపల్లిలో రూ.5 లక్షలు, నాగరాజుపల్లిలో రూ.5 లక్షలతో సీసీ రోడ్లు, అరుగులు, తాగునీటి పథకాల నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనర్ చింతంరెడ్డి సుబ్బారెడ్డి, అయ్యవారిపల్లి సర్పంచి దుర్గాప్రసాద్, బాలినేని మాబయ్య, ఎల్ బ్రహయ్య, సతీష్ కుమార్, రేనాటి రమణయ్య, టీ. శ్రీనివాసులు, రాకేష్, పాలకొలను వెంకటరెడ్డి పాల్గొన్నారు.


బాలాయపల్లిలో సిమెంట్‌రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి

వక్ఫ్ చట్ట సవరణ రద్దు చేయాలి

అనంతసాగరం ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక నేషనల్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం వక్ఫ్ సవరణ చట్టం రద్దు చేయాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా చట్టంతో అనర్థాలు ఉన్నాయని, ప్రతి ఒక్కరూ ఖండించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు, ముస్లిం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గురుకులం ఎంట్రెన్స్

సంగం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక డాక్టర్ బీఆర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 5వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశానికి ఆదివారం జరిగిన పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 10గంటలకు జరిగిన 5వ తరగతి పరీక్షకు 184 మందికిగాను 81 మంది పరీక్షకు హాజరయ్యారు. అదేవిధంగా మధ్యాహ్నం జరిగిన ఇంటర్ ప్రథమ సంవత్సర ప్రవేశ పరీక్షకు 282 మంది దరఖాస్తు చేసుకోగా 205 మంది పరీక్షకు హాజరయ్యారు.

ఆర్థిక సాయం

వింజమూరు, (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ పరిధిలోని బీటీకేఆర్ ఎస్టీ కాలనీకి చెందిన రావూరి కిషోర్ విద్యుత్‌షాక్‌కు తీవ్రంగా గాయపడ్డాడు. వైద్యం ఖర్చులకు కూడా డబ్బులు లేక మంచానికే పరిమితమ య్యాడు. సమాచారం తెలుసుకున్న గడ్డం పకీరయ్య అతడి ఇంటికి వెళ్లి పరామర్శించి రూ.10వేలు ఆర్థిక సాయాన్ని ఆదివారం అందజేశారు.

న్యూస్ బాక్స్

అక్రమ కేసులకు భయపడం

కావలిటౌన్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి) అధికార పార్టీ బెదిరింపులకు, అక్రమ కేసులకు భయపడబోమని అవసరమైతే జైలుకెళ్లేందుకు సిద్ధమని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం జర్నలిస్ట్ క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. పట్టణంలో జరిగిన మనీ స్కామ్‌లో సూత్రధారిని పట్టుకున్నా, ఇంతవరకు అతీగతీ లేదని ఆ కేసు ఇక హుష్‌కాకేనా ? అని ప్రశ్నించారు. తాను భూకబ్జాలు చేసినట్లు ప్రచారం చేస్తున్నారని, ఆ భూములెక్కడున్నాయో చూపించి స్వాధీనం చేసుకోవాలని తెలిపారు. ఈ విషయాన్ని పదేపదే చెబుతున్నా ఎందుకు స్వాధీనం చేసుకోలేదని ప్రశ్నించారు. చంద్రబాబు చేసిన మోసం తెలుసుకుని ప్రజలు నేడు చింతిస్తున్నారన్నారు. సమావేశంలో పలువురు వైసీపీ నేతలు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

కావలి,ఏప్రిల్13 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు గుడ్డ సంచులనే వాడదామని జేవీవీ కావలి శాఖ గౌరవాధ్యక్షుడు డాక్టర్ బెజవాడ రవికుమార్, అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు తెలిపారు. జేవీవీ ఆధ్వర్యంలో దాత రాజశేఖర్ సహకారంతో ఆదివారం రైతుబజారు వద్ద వినియోగదారులకు గుడ్డ సంచులు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ క్యాన్సర్‌కు కారకమైన ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించి, గుడ్డ సంచులనే ప్రతి ఒక్కరూ వాడుకోవాలన్నారు. కార్యక్రమంలో జేవీవీ నేతలు గాదిరెడ్డి హరినాథ్, కోశాధికారి టీ. సుబ్బరాయశర్మ, జీ కల్యాణి, కే. నారాయణ, కే. హరినారపరెడి, ఎస్‌కే ఖాదర్ బాష, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

అనివేటి మండపం నిర్మాణానికి విరాళం

కందుకూరు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): గ్రామదేవత అంకమ్మ ఆలయ అనివేటి మండపం నిర్మాణం కోసం చెరుకూరి రమేష్‌బాబు -అనిత దంపతులు రూ. 10 లక్షలు విరాళాన్ని ఆదివారం కమిటీ సభ్యులకు అందజేశారు. గుత్తా వెంకటనరసింహం, దివి ప్రణీత్‌చౌదరిల జ్ఞాపకార్థం ఈ మొత్తాన్ని అందజేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వై. వెంకటరెడ్డి, ఏ.మాధవరావు, జీ. శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సామాన్యుడి నడ్డి విరుస్తున్న నిత్యావసరాలు

బిట్రగుంట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు సామాన్యుడి నడ్డి విరుస్తున్నాయని సీపీఎం మండల పార్టీ సీనియర్ నేత తుమ్మల వెంకయ్య అన్నారు.బోగోలు మండలం ఇబ్రహీంపేటలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలకు సామాన్యుడి ఆర్థిక పరిస్థితిపై అవగాహన లేదా ? అని ప్రశ్నించారు. పెరిగిన నిత్యావసర వస్తువులతోపాటు పెట్రోల్, డీజిల్ ధరలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల సీఐటీయూ కార్యదర్శి చల్లా నరహరి, రైతు నాయకులు పీ.శ్రీనివాసులు, సీఐటీయూ నేత షేక్.అన్వర్‌భాషా, మండల ఉపాధ్యాయ సంఘాధిపతి ఎస్.రామయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకునేందుకే 'పల్లెకు పోదాం'

బిట్రగుంట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సమస్యలు తెలుకునేందుకే 'పల్లెకు పోదాం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని బీజేపీ మండల అధ్యక్షుడు వీరాల శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బోగోలు మండలం ఎస్‌జీవీ కండ్రికలో ఆదివారం బీజేపీ నేతలు ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బెల్లంకొండ మాల్యాద్రి పాల్గొని మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ఆర్థికాభివృద్ధికి కేంద్రం ప్రవేశ పెట్టిన పథకాలను వివరించారు. అనంతరం స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గోపికృష్ణ యాదవ్, గుర్రం వెంకటేశ్వర్లు, పసులేటి సూర్యం పాల్గొన్నారు.

అగ్నిమాపకశాఖ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

కావలి రూరల్, ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక శాఖ సేవలు ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ జీ. ప్రభాకర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలో సోమవారం నుంచి ఈనెల 20వ వరకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. అపార్టుమెంట్‌వాసులు, విద్యాలయాలు, బస్టాండ్, రైల్వేస్టేషన్, పెట్రోల్ బంక్ తదితర ప్రాంతాల్లో నిర్వహించే ఈ అవగాహన వారోత్సవాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే టోల్‌ఫ్రీ నెంబరు 101, 112లతోపాటు ఫైర్‌స్టేషన్ నెంబరు 08626-243101, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ నెంబరు 99637 34286కి ఫోన్ చేయాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దుత్తలూరు(ఉదయగిరి), ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్రవాడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఆర్డీఎస్ పనులు జరుగుతున్నాయి. దీంతో సోమవారం ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ వెంకటసుబ్బయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సొంత ఆలోచనలతో మార్గం ఏర్పరచుకోవాలి

కావలిటౌన్, ఏప్రిల్13: విద్యార్థులు సొంత ఆలోచనలతో మార్గం ఏర్పరచుకోవాలని ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆదివారం ఆయన అభినందించారు. పుల్లారెడ్డినగర్‌లోని శ్రీవశిష్ఠ కళాశాలలో జరిగిన అభినందన సభలో ఆయన పాల్గొని ర్యాంకర్లకు ట్రోఫీలందించారు. అనంతరం మాట్లాడుతూ కావలి విద్యార్థులు జిల్లా, రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించడం గర్వకారణమన్నారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ అల్తాఫ్ అధ్యక్షత వహించగా, కరస్పాండెంట్ సురేంద్రరెడ్డి, సామశిల ప్రాజెక్ట్ కమిటీ మాజీ చైర్మన్ మధుబాబునాయుడు, ఎమ్మెస్సార్ కళాశాల కరస్పాండెంట్ రాజ్‌కుమార్‌చౌదరి, అధ్యాపకులు, తల్లితండ్రులు పాల్గొన్నారు. అలాగే శ్రీశ్రీనివాస కళాశాల ర్యాంకర్లను కూడా ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ బట్టేపాటి అశోక్ కుమార్, డైరెక్టర్ మాలకొండయ్య, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కృష్ణారెడ్డి చేతుల మీదుగా ట్రోఫీలు అందుకున్న వశిష్ఠ విద్యార్థినులు పూజిత చౌదరి, లక్ష్మీహరిత

చెంచురామయ్య స్ఫూర్తితో ముందుకు..

ఉదయగిరి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే పొన్నెబోయిన చెంచురామయ్య స్ఫూర్తితో నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తెలిపారు. ఆదివారం స్థానిక చెంచురామయ్య అతిథి గృహంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పీ. చెంచలబాబుయాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన చెంచురామయ్య 23వ వర్ధంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్, ప్రవీణ దంపతులు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ప్రాంతంలో సాగు, తాగునీటి కష్టాలు తీర్చాలని అసెంబ్లీలో పోలికేక వేసిన వ్యక్తి చెంచు రామయ్య అన్నారు. నియోజకవర్గంలో గండిపాళెం, నక్కలగండి, మర్రిపాట్ల రిజర్వాయర్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారన్నారు. నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన టీడీపీ నాయకులు చెంచురామయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి, టీడీపీ నాయకులు రియాజ్, బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, బొజ్జా శ్రీనివాసులు, సందానీ, శ్రీకుర్తి రవీంద్రబాబు, తుమ్మల కిరణ్, ఉడతా సుమన్ యాదవ్, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


కలిగిరి : పవిత్ర స్కూల్ వార్షికోత్సవాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

● విద్యార్థులకు నైపుణ్యం తప్పనిసరి

కలిగిరి, ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి చిన్నతనం నుంచి విద్యతోపాటు అన్ని రంగాల్లోనూ నైపుణ్యం సాధిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. స్థానిక పవిత్ర ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో ఆదివారం జరిగిన 17వ వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఓ లక్ష్యాన్ని ఎంచుకొని ఉన్నతస్థితిలో నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దంపతులతోపాటు పవిత్ర విద్యాసంస్థల చైర్మన్ ఎండ్లూరి వెంకటేష్, జడ్పీటీసీ మాల్యాద్రిరెడ్డి, ఎంపీపీ శిరీష, టీడీపీ కన్వీనర్ బీ. క్రిష్ణారెడ్డి, మేనేజ్‌మెంటు ఎండ్లూరి రమణయ్య, మాదాల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వాశిలిలో అభయాంజనేయ విగ్రహ ప్రతిష్ఠ


సంగం : రాజరాజేశ్వరిదేవి ఆలయంలో జరిగిన హోమంలో పాల్గొన్న భక్తులు

ఆత్మకూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వాశిలి గ్రామంలోని తూర్పు ఎస్సీ కాలనీలో నూతనంగా నిర్మించిన అభయాంజేయ స్వామి ఆలయంలో ఆదివారం విగ్రహ ప్రతిష్ఠ గావించి పూజలు నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠకు విచ్చేసిన భక్తులకు నిత్య అన్నదాత, సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కంచి పరమేశ్వరరెడ్డి తన సొంత నిధులతో అన్నప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, స్థానికులు కంచి పరమేశ్వరరెడ్డిని సన్మానించారు.

● రాజరాజేశ్వరిదేవికి పౌర్ణమి పూజలు

సంగం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిరుమనకొండలో వెలసి ఉన్న శ్రీరాజరాజేశ్వరిదేవి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పీఠాధిపతి రాజరాజేశ్వరానందస్వామి ఆధ్వర్యంలో శ్రీ రాజరాజేశ్వరిదేవి సమేత కాశీ విశ్వేశ్వరస్వామికి అభిషేకాలు నిర్వహించి పూలతో అలంకరించారు. అనంతరం లలిత సహస్రనామ, హోమం తదితర పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

● నాగారపమ్మదేవికి..

సంగం మండలంలోని కోలగట్లలో వెలసి ఉన్న నాగారపమ్మదేవి ఆలయంలో ఆదివారం పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్షీర, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి అనంతరం మూలవిరాట్‌కు పూలతో అలంకరించారు. మహిళలు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

● సీతారాములకు ఏకాంతసేవ

బిట్రగుంట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): బోగోలు యాదవపాలెం కోదండరామాలయంలో సీతారాముల కల్యాణం అనంతరం ఆదివారం రాత్రి ఏకాంత సేవ జరిగింది. పర్వతనేని యానాదినాయుడు (వాసు)- శ్రీవాణి దంపతులు ఉభయ కర్తలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి భక్తులు వేలాదిగా తరలివచ్చారు.

● వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

దుత్తలూరు(ఉదయగిరి), ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డదిన్నెలో నూతనంగా నిర్మించిన శ్రీకోదండరామస్వామి ఆలయంలో ఆదివారం శ్రీసీతారామలక్ష్మణ విగ్రహాల ప్రతిష్ఠను వైభవంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ శాస్త్రోక్తంగా విగ్రహ ప్రతిష్ఠ, కలశ, శిఖర ప్రతిష్ఠ, కుంబాబిషేకాలు, హోమాలు, ప్రత్యేక పూజలు తదితర కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు ముఖ్యఅతిథులుగా హాజరైన ఎమ్మెల్యే కాకర్ల సురేష్, ప్రవీణ దంపతులకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం వారు విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొని స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఉండేలా గురవారెడ్డి, మన్నేటి వెంకటరెడ్డి, మల్లంపాటి గురవయ్యనాయుడు, శ్రీకుర్తి రవీంద్రబాబు, చీదర్ల మల్లికార్జున, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


అన్న ప్రసాద వితరణలో పరమేశ్వరరెడ్డి

రేపు సామాజిక తనిఖీ ప్రజా వేదిక

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం సామాజిక తనిఖీ బహిరంగ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఆదివారం ఎంపీడీవో వేణుగోపాల్‌రావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులకు సంబంధించి ఆడిట్ బృందం గ్రామాల్లో విచారణ చేపట్టడం జరిగిందన్నారు. అందులో భాగంగా ప్రజావేదికలో నివేదికలు చదివి వినిపించడం జరుగుతుందన్నారు. కావున ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, ఉపాధి సిబ్బంది హాజరు కావాలని ఆయన కోరారు.

చలివేంద్రం ప్రారంభం

దుత్తలూరు(ఉదయగిరి), ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): దుత్తలూరు సెంటర్‌లోని పోలీస్‌స్టేషన్ సమీపంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం పారిశ్రామికవేత్త నంబూరి రోశిరెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఎండకు ప్రయాణికులు, ప్రజలు, వాహనదారులు తాగునీటికి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ఈ చలివేంద్రాన్ని ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు లెక్కల వెంగళరెడ్డి, బీజేపీ, టీడీపీ నాయకులు రామయ్య, చుండి హరిగోపాల్‌రెడ్డి, చిన్నపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఇంటర్ తర్వాత..?

- కోర్సుల ఎంపికే కీలకం
- భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలి
- మూడు, నాలుగేళ్లు కష్టపడితే ఆనందమయ జీవితం



నెల్లూరు (విద్య), ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ పరీక్షల ఫలితాలు వచ్చేశాయి. తర్వాత ఏం చదవాలి.. ఏ రంగంలో స్థిరపడాలనే సందేహాలు విద్యార్థుల మెదళ్లను తొలిచేస్తుంటాయి. డాక్టర్, ఇంజనీర్, శాస్త్రవేత్త, బ్యాంక్ ఉద్యోగి, చార్టర్డ్ అకౌంటెంట్, వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు.. ఇలా ఎన్నో అవకాశాలు ఊరిస్తుంటాయి. తల్లిదండ్రులు, స్నేహితుల ఒత్తిడి మేరకు నిర్ణయం తీసుకోకుండా మీ కిష్టమైన కోర్సును ఎంపిక చేసుకుని ముందుకు సాగితే భవిష్యత్ ఆనందమయంగా ఉంటుందని విద్యార్థులకు నిపుణులు సూచిస్తున్నారు.

ఇంజనీరింగ్..

ఎంసెట్‌లో ఇంజనీరింగ్ కోర్సులకు ప్రాధాన్యం అధికం. ఇందులో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, మెకానికల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఐటీ, ఈఈఈ వంటి కోర్సులు ఉన్నాయి. ఆసక్తి ఉంటే వీటిల్లో ఏదో ఒక కోర్సులో రాణించే అవకాశం ఉంటుంది.

వైద్య విద్య..

వైద్యవృత్తిపై ఆసక్తి ఉంటే ఎంబీబీఎస్ కోర్సు ఉత్తమం. నీట్‌లో వచ్చిన ర్యాంకు ఆధారంగా కౌన్సెలింగ్‌లో సీటు లభిస్తుంది. ఎంబీబీఎస్ పూర్తి చేసినవారు ఆసుపత్రుల్లో సివిల్ అసిస్టెంట్ సర్జరీ మెడికల్ ఆఫీసర్ వంటి ఉద్యోగాలు పొందవచ్చు. సొంతంగా ఆసుపత్రి కూడా పెట్టుకోవచ్చు. ఎంబీబీఎస్‌లో సీటు రాకపోతే బీడీఎస్‌లో సీటు పొంది భవిష్యత్‌కు బాటలు వేసుకోవచ్చు.

సీఏతో విశ్వవ్యాప్త ఉపాధి..

దేశ ఆర్థిక వ్యవహారాల్లో పర్యవేక్షణ నియంత్రణకు సీఏ కోర్సు ఎంతో దోహదం చేస్తుంది. ఇంటర్ తర్వాత సీపీటీ ప్రవేశ పరీక్ష ఉంటుంది. దీనిలో అర్హత సాధించి ఐపీసీపీలో చేరవచ్చు. నాలుగున్నరేళ్లు శ్రద్ధగా చదివితే సమాజంలో ఉన్నత హోదాలో కొనసాగే అవకాశం ఉంటుంది.

ఫార్మసీ ఎంతో ప్రాధాన్యం..

ఔషధ రంగ పరిశోధన, అభివృద్ధి రంగాల్లో ఫార్మసీ విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుంది. అవకాశాలు విస్తృతంగా ఉంటాయి. ఎంసెట్‌తోనే బీఫార్మసీ ప్రవేశాలు జరుగుతాయి. ఇది పూర్తిచేసిన వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్, టెక్నికల్ ఆఫీసర్, హాస్పిటల్ ఫార్మాసిస్టులుగా ఉద్యోగాలు లభిస్తాయి.

వ్యవసాయం, ఉద్యానవనం..

ఎంసెట్‌తోనే బీఎస్సీ అగ్రికల్చర్, ఆర్టికల్చర్ (బైపీసీ విద్యార్థులు) చదివే అవకాశం ఉంది. నాలుగేళ్ల బీఎస్సీ అగ్రికల్చర్, ఆపై పీజీ తర్వాత పరిశోధన వైపు అడుగులు వేసే అవకాశం ఉటుంది. ప్రభుత్వ ప్రైవేట్ రంగాల్లో ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.

సేవ చేయాలనుకుంటే..

బైపీసీ విద్యార్థులకు బీఎస్సీ నర్సింగ్ మరో చక్కని అవకాశం. ఈ కోర్సుతో స్వయం ఉపాధి పొందడమే కాకుండా రోగులకు సేవ చేసే అవకాశం ఉంటుంది. ఇంటర్ తర్వాత నాలుగేళ్ల కోర్సును ఎంపిక చేసుకుంటే ఆపై వెంటనే ఉద్యోగం వస్తుంది. రెండేళ్ల ఫిజియోథెరపీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి..

న్యాయవాద వృత్తి..

ఇంటర్ తర్వాత ఐదేళ్ల న్యాయవిద్య కోర్సు ఉంటుంది. లాసెట్‌తో ప్రవేశాలు జరుగుతాయి. స్థిరపడేందుకు ఎక్కువ సమయం తీసుకున్నా ఉపాధికి ఏమాత్రం ఢోకా ఉండదు. న్యాయవాదిగా, వ్యాపార సంస్థల న్యాయ సలహాదారుగా రాణించే అవకాశం ఉంటుంది.

సంప్రదాయ డిగ్రీ..

డిగ్రీ అంటే చిన్నచూపు వద్దు. శ్రద్ధతో చదివితే మంచి అవకాశాలు ఉన్నాయి. బీఏతో పాటు బీకాం జనరల్, కంప్యూటర్ కోర్సులకు మంచి డిమాండ్ ఉంది. బీఎస్సీలో అనేక కాంబినేషన్ కోర్సులు ఉన్నాయి. వీటిలో ఏదో ఒకటి ఎంచుకోవచ్చు. డిగ్రీ అనంతరం పీజీ పూర్తి చేసి గ్రూప్స్‌కు, సివిల్స్‌కు ప్రిపేర్ అవ్వవచ్చు.

డీఎడ్..

ఉపాధ్యాయ వృత్తిపై మక్కువ ఉంటే రెండేళ్ల డీఎడ్ కోర్సులో చేరవచ్చు. జిల్లాలో ఇలాంటి కళాశాలలు ప్రభుత్వ, ప్రైవేట్ రంగంలోనూ ఉన్నాయి. డీఎడ్ కామన్ ఎంట్రన్స్ పరీక్షతో సీటు లభిస్తుంది. నేడు ఉపాధ్యాయ వృత్తికి కూడా ఎంతో డిమాండ్ ఉంది.

విద్యార్థులకు సూచనలు..

- ప్రతి విద్యార్థికీ ఏదో ఒక అభిరుచి ఉంటుంది. ఇప్పుడే దానిని గుర్తించాలి. సామర్థ్యం ఉన్న సబ్జెక్ట్‌ను ఎంచుకుని అందులో చేరాలి
- తల్లిదండ్రులు చెప్పారని, స్నేహితులు తీసుకున్నారని ఏ కోర్సులో పడితే దానిలో చేరవద్దు. మార్కెట్ డిమాండ్ కన్నా మనసుకు నచ్చిన దానికి ప్రాధాన్యం ఇవ్వాలి.
- పట్టుదల ఉంటేనే చదువులో రాణించగలరు. ఇంజనీరింగ్ విద్య పూర్తిచేసిన ప్రతి వందమందిలో 60 మందిని స్కిల్స్ లేవని కంపెనీలు తిరస్కరిస్తున్నాయి. ఆ జాబితాలో మీరు లేకుండా చూసుకోండి.
- తల్లిదండ్రులు మార్గదర్శనం చేయాలి తప్ప దిశానిర్దేశం కాదు. పిల్లలకు ఇష్టమైన కోర్సుల్లో చేరనీయండి. అందులో రాణించేలా ప్రోత్సాహం అందించాలి. వారిపై ఒత్తిడి తెచ్చి ఇబ్బందులు పెట్టకూడదు. భవిష్యత్‌కు బాటలు వేసే ఎన్నో కోర్సులు అందుబాటులో ఉన్నాయి..ఆలోచించి నిర్ణయం తీసుకోండి.



పురుషామృగ వాహనంపై సంగమేశ్వరుడు

సంగం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంగమేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు పురుషామృగ వాహనంపై సంగమేశ్వర స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా శ్రీకామాక్షిదేవి, సంగమేశ్వరుడి ఉత్సవ విగ్రహాలను పురుషామృగ వాహనంపై ఉంచి పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమానికి రొక్కరొక్కల నారాయణ - నరసమ్మ, రఘుపతి - శ్రీదేవి దంపతులు ఉభయ కర్తలుగా వ్యవహరించారు. సోమవారం సంగమేశ్వరస్వామి కల్యాణం జరుగుతుండడంతో భక్తులు పాల్గొనాలని ఆలయ పూజారి గోపాలకృష్ణమూర్తి తెలిపారు.



బోగోలులో రెడ్ మూన్

బిట్రగుంట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలో ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా కారు మేఘాలు కమ్ముకుని, ఈదురు గాలులు వీచాయి. గాలులకు బేతనీపేటలో చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలపై పడటంతో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. విశ్వనాథరావుపేట కొత్తూరు గ్రామంలో చెట్టు కొమ్మ విరిగి పడి విద్యుత్ తీగలు తెగినట్లు విద్యుత్‌శాఖ అధికారి జడరాయ్ తెలిపారు. అక్కడక్కడ స్వల్ప వర్షం కురిసినట్లు స్థానికులు తెలిపారు. లైన్‌మన్ బ్రహ్మయ్య, సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని చెట్టుకొమ్మలు తొలగించారు. విద్యుత్ అంతరాయం ఏర్పడి చిమ్మచీకట్లు అలుముకోవడంతో ఆకాశంలోని చంద్రుడు మండుతున్న గోళంగా ఎర్రగా కనిపించాడు.

నేడు విషు

- అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక దర్శనం

నెల్లూరు (సాంస్కృతికం), (ఆంధ్రజ్యోతి) : కేరళ సంవత్సరాది విషు పండుగను జిల్లాలోని మలయాళీలు సోమవారం జరుపుకోనున్నారు. ఈ సందర్భంగా నెల్లూరులోని అయ్యప్ప దేవస్థానంలో స్వామివారి ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేస్తున్నారు. దీనిని విషు కృణి దర్శనం అని పిలుస్తారు. దర్శనం అనంతరం భక్తులందరికీ స్వామి వారి గర్భాలయం నుంచి మేల్ శాంతి చిల్లర నాణేలు అందిస్తారు. ఉదయం 5 గంటలకు మహా గణపతి హోమం, 7.30కు ఉషః పూజ, 10గంటలకు విశేష అభిషేకాలు, 12గంటలకు ఉచ్ఛ పూజ, తదుపరి అన్నప్రసాద వితరణ, సాయంత్రం 6 గంటలకు మహాదీపారాధన, 8 గంటలకు అత్తాళ పూజ జరుగుతాయని ఆలయ పాలకమండలి ప్రకటించింది.

కండలేరు నీటి మట్టం 46.81 టీఎంసీలు

రాపూరు, (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఉన్న కండలేరు నీటిమట్టం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటిమట్టం 46.81 టీఎంసీలుగా ఏఈ కట్టా తిరుమలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల, ఇతర కాలువల నుంచి ఇన్‌ఫ్లో నీరు ఆగిపోగా, అవుట్‌ఫ్లో 1475 క్యూసెక్కులుగా ఉందని ఆయన తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి 1395 క్యూసెక్కులు, లోలెవల్ స్లూయిస్ 50 క్యూసెక్కులు, హైలెవల్ కెనాల్ 30 క్యూసెక్కుల చొప్పున మొత్తం 1475 క్యూసెక్కులు నీరు అవుట్ ఫ్లో అవుతుందని అధికారులు తెలిపారు.

విద్యుదాఘాతానికి రైతు మృతి



చెంచునాయుడు (ఫైల్)

కలిగిరి, ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి): మండలంలోని కావలి ముస్తాపురంలో వ్యవసాయ పనులు చేస్తుండగా శనివారం రాత్రి ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై నంబూరి చెంచునాయుడు(60) మృతిచెందాడు. గ్రామస్థుల కథనం మేరకు, చెంచునాయుడు జామాయిల్ పొలంలో పనులు చేస్తుండగా, చేతిలోని పార విద్యుత్ తీగలకు తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఆదివారం ఉదయం ఆయన మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి ..

సంగం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంగమేశ్వరాలయంలో వడ దెబ్బకు గురై వైద్యశాలలో చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి ఆదివారం మృతి చెందినట్లు ఎస్‌ఐ రాజేష్ తెలిపారు. ప్రస్తుతం సంగంలోని సంగమేశ్వరాలయంలో బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. ఈ ఉత్సవాలకు వచ్చిన వ్యక్తి శనివారం వడదెబ్బకు గురవడంతో చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఆత్మకూరు వైద్యశాలకు తరలించిన విషయం విదితమే. అక్కడ చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సౌత్ రైల్వేస్టేషన్‌లో..

నెల్లూరు(వ్యవసాయం), ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): నెల్లూరు సౌత్ రైల్వేస్టేషన్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని రైల్వే పోలీసులు ఆదివారం గుర్తించారు. 45 నుంచి 50 ఏళ్ల వ్యక్తి మృతి చెందాడు. మృతదేహంపై తెలుపురంగు ఫుల్‌హ్యాండ్స్ చొక్కా, నలుపు రంగుపై పసుపు రంగు డిజైన్ కలిగిన లుంగీ ఉన్నాయి. ఎడమ చేయి మోచేతి వరకు లేదు. రైల్లోంచి ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెంది ఉంటాడని పోలీసులు అనుమాని స్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నట్లు రైల్వే ఎస్‌ఐ హరి చందన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వెంకటాచలం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : వెంకటాచలంలోని ఇందిరమ్మ కాలనీ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. నెల్లూరులోని పద్మావతి సెంటర్ ప్రాంతానికి చెందిన నంద కుమార్, సుధీర్ మోటర్ బైక్‌పై పూడిపర్తికి వెళ్లి తిరిగి వస్తున్నారు. ఇందిరమ్మ కాలనీ వద్ద ఉన్న మలుపు దగ్గరకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న మినీ వ్యాన్‌ను తప్పించే క్రమంలో అదుపుతప్పి బైక్ బోల్తాపడింది. దీంతో ఇద్దరు గాయపడ్డారు. క్షతగాత్రులను సమీపంలోని సీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మాజీ సైనికులకు అవగాహన కార్యక్రమం

అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా సైనిక సంక్షేమ అధికారి హరికృష్ణ



నెల్లూరు (హరనాధపురం) ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : త్రివిధ దళాల్లో సేవల అనంతరం వివిధ సంస్థల్లో పని చేస్తున్న మాజీ సైనికులకు జిల్లా సైనిక భవన్‌లో ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సిస్టమ్ ఫర్ పెన్షన్ అడ్మినిస్ట్రేషన్ (రక్షక్), వివిధ గ్రాంట్లు, కామన్ సర్వీస్ సెంటర్ ఏర్పాటు తదితర విషయాలపై జిల్లా సైనిక్ అధికారి జీ హరికృష్ణ అవగాహన కల్పించారు. మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు కళాధర్, హౌసింగ్ సొసైటీ డైరెక్టర్ బీజే రెడ్డి, మాజీ సైనికులు పాల్గొన్నారు.

జొన్నవాడలో బెరస కోళ్ల చోరీ

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జొన్నవాడ దళితవాడ సమీపంలో ఉంటున్న పాశం రాజయ్య, కందనగోళ్ల మల్లికార్జునకి చెందిన 50 మేలు జాతి బెరస కోళ్లను గుర్తు తెలియని వ్యక్తులు శనివారం అర్ధరాత్రి చోరీ చేశారు. యథావిధిగా ఉదయం ఆ కోళ్లకు మేత వేసేందుకు వెళ్లగా, కోళ్లుండే గది తలుపులు తీసి ఉన్నాయి. అందులో ఒక్క కోడి కూడా లేకపోవడంతో బాధితులు గుండెలు బాదుకున్నారు. చోరీకి గురైన ఒక్కొక్క కోడి విలువ రూ. 15 నుంచి రూ. 20 వేల విలువ ఉంటుంది. ఈ ఘటనపై ఆదివారం బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు

ఇందుకూరుపేట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లెపాడు పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో ఆదివారం సర్వమత ప్రార్థనలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ముందుగా కమిటీ సభ్యులు గంపల మంజుల గాంధీ, ఆశ్రమ స్థల దాత పొణకా కనకమ్మ విగ్రహాలకు ఖాదీ వస్త్రాలు, నూలుమాలలు సమర్పించారు. అనంతరం స్కూల్ విద్యార్థులకు గాంధీ జీవిత విశేషాలను తెలిపారు. కార్యక్ర మంలో విద్యార్థులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్‌కు పూర్వ వైభవం

- రూ.51.81 కోట్లతో 1240 యూనిట్ల మంజూరు
- నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

నెల్లూరు (హరనాధపురం) ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : ఎలాంటి పథకాలకు నోచుకోక ఐదేళ్లుగా నిర్వీర్యమైన ఎస్సీ కార్పొరేషన్ తిరిగి పూర్వ వైభవాన్ని సంతరించుకుంటోంది. 2019లో వైసీపీ అధికారంలోకి రాగానే అప్పటివరకు అమలులో ఉన్న అన్ని పథకాలకు మంగళం పాడింది. ఒక ఎస్సీ కార్పొరేషన్ మాత్రమే కాదు.. బీసీ, ఎస్టీ, మైనార్టీ కార్పొరేషన్లకు కూడా నిధులు విడుదల చేయలేదు. వైసీపీ హయాంలో ఎన్నో అవస్థలు పడిన బడుగు వర్గాలు గతేడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమికి పట్టం కట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్పొరేషన్లకు జీవసత్వాలు తెచ్చేందుకు చర్యలు చేపట్టింది. ఇప్పటికే బీసీ కార్పొరేషన్ ద్వారా వేలాది మందికి యూనిట్లు అందించేందుకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేసింది. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా కూడా రుణాలు ఇచ్చేందుకు కార్యాచరణ ప్రణాళికను ప్రకటించింది.

నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

గత తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు అమలులో ఉన్న అన్ని పథకాలను తిరిగి అమలు చేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. ముందుగా బ్యాంకు లింకేజీ రుణాలను ఎస్సీలకు అందించేందుకు నిర్ణయించింది. ఇందుకోసం ఈ నెల 14 నుంచి మే నెల 10వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించనుంది.

1,240 మంది లబ్ధిదారులకు..

ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఈ ఏడాది రూ.51.81 కోట్లతో 1240 మంది లబ్ధిదారులకు పలు యూనిట్ల మంజూరుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. ఇందులో రూ.20.46 కోట్లు సబ్సిడీగాను రూ.28.75కోట్లు బ్యాంకు రుణాలు, రూ.2.59 కోట్లు లబ్ధిదారుల వాటాగా నిర్ణయించారు. ఓబీ ఎంఎంఎస్ ద్వారా ఆన్‌లైన్‌లో లబ్ధిదారుల ఎంపిక కోసం దరఖాస్తులను స్వీకరించనున్నారు. మే నెల 11 నుంచి 20వ తేదీ వరకు లబ్ధిదారుల ఎంపికను మండల సెలక్షన్ కమిటీ చేపడుతుంది.. 21 నుంచి 27వతేదీ వరకు ఎంపికైనవారి జాబితాను ఎంపీడీవోలు బ్యాంకులకు పంపుతారు. 28 నుంచి జూన్ 12 వరకు బ్యాంకులో రెండు ఖాతాలు ఓపెన్ చేసుకోవాలి. 13 నుంచి 20వ తేదీ వరకు లబ్ధిదారులకు పరిపాలన పరమైన ఉత్తర్వులు ఇస్తారు. 21 నుంచి ఆగస్టు 9లోగా యూనిట్లు గ్రౌండ్ చేస్తారు.



ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయం

యూనిట్ల వివరాలు.

రూ.3లక్షల లోపు యూనిట్లు 226 ఉన్నాయి. ఒక్కో యూనిట్‌కు సబ్సిడీ 60 శాతం, బ్యాంకులోను 35శాతం, లబ్ధిదారు వాటా 5శాతం ఉంటుంది. రూ.3లక్షల నుంచి 10లక్షలలోపు యూనిట్లు 628 ఉన్నాయి. వీటికి సబ్సిడీ 40 శాతం, బ్యాంకులోను 55 శాతం, లబ్ధిదారు వార్డు 5 శాతం ఉంది. రవాణా సెక్టార్‌కు సంబంధించి రూ.3లక్షల లోపు యూనిట్లు 233 ఉన్నాయి. రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షల లోపు యూనిట్లు 145 ఉన్నాయి. వీటిలో ప్యాసింజర్ ఆటోలు 47, ప్యాసింజర్ కారు 47, గూడ్స్ ట్రక్కులు 47 ఉన్నాయి. వీటికి సబ్సిడీ 50 శాతం, బ్యాంకులోను 45శాతం లబ్ధిదారు వాటా ఐదు శాతం ఉంది. వ్యవసాయ సెక్టార్ల కింద 11 డ్రోన్‌లను అందజేయనున్నారు. వీటికి సబ్సిడీ 40శాతం, బ్యాంకులోను 55 శాతం, లబ్ధిదారుల వాటా 5శాతం ఉంటుంది. ఇందుకు సంబంధించి కార్యాచరణ ప్రణాళికను ఎస్సీ కార్పొరేషన్ అధికారులు రూపొందించారు. ఈ అవకాశాన్ని ఎస్సీ లబ్ధిదారులంతా సద్వినియోగం చేసుకోవాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసులు కోరారు.

అడవిలో అగ్నికీలలు..



దగ్ధమవుతున్న దుర్గంకొండపై వృక్షాలు

ఉదయగిరి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): దుర్గం కొండ ప్రాంతంలో అగ్నికీలలు ఎగిసిపడ్డాయి. ఆదివారం గుర్తుతెలియని వ్యక్తులు అడవికి నిప్పు పెట్టడంతో విలువైన వృక్ష సంపద దగ్ధమవడంతో పాటు వన్యప్రాణులు సైతం ప్రమాద బారినపడ్డాయి. మంటలకు ఈదురుగాలులు తోడు కావడంతో అడవంతా అగ్నికీలలు వ్యాపించాయి.

మద్యం మత్తులో కత్తితో యువకుడి వీరంగం

- భార్యాభర్తలకు స్వల్ప గాయాలు

సంగం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంగమేశ్వరాలయ బ్రహ్మోత్సవాలకు వచ్చిన కావలికి చెందిన ఓ వ్యక్తి ఆదివారం మద్యం మత్తులో కత్తితో వీరంగం సృష్టించాడు. దీంతో అదే ప్రాంతానికి చెందిన బండి కార్తీక్, పోలమ్మ అనే దంపతులు స్వల్పంగా గాయపడ్డారు. వివరాల మేరకు కావలి పట్టణంలోని ఎస్టీ కాలనీకి చెందిన ఏడుకొండలు, మహాలక్ష్మమ్మ, వెంకటేశ్వర్లు, ఆకాష్‌తో పాటు అదే కాలనీకి చెందిన బండి కార్తీక్, పోలమ్మ అనే దంపతులు సంగం బ్రహ్మోత్సవాల్లో భిక్షం ఎత్తుకునేందుకు వచ్చారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి ఏడుకొండలు, వెంకటేశ్వర్లు మద్యం మత్తులో కార్తీక్, పోలమ్మలతో వివాదానికి దిగి కత్తితో దాడి చేశాడు. ఆ దాడిలో కార్తీక్, పోలమ్మకు స్వల్పంగా గాయాలు కాగా పోలమ్మ నాలుగు నెలల గర్భిణి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని బాధితులను స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఆత్మకూరు జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నెల్లూరు సిటీ

రూరల్, కోవూరు, సర్వేపల్లి

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	117
స్కిన్ చికెన్	210
స్కిన్‌లెస్	232

కోడిగుడ్ల ధర (100) : 420

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.9033
వెండి కిలో ధర	రూ. 98,000
వెండి ఒక గ్రాము	రూ.101.00

అంబేడ్కర్, పూలేకు నివాళి

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 13 (ఆంధ్ర జ్యోతి) : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్, సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా బీటీపీ ఆధ్వర్యంలో వారికి ఆదివారం ఘనంగా నివాళి అర్పించారు. నగరంలోని క్రాంతినగర్ ఎంసీ యూపీ పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టేటి రమేష్ మాట్లాడుతూ అంబేడ్కర్, పూలే దేశానికి అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పల్లం వేణుగోపాల్, వ్యవస్థాప క అధ్యక్షుడు నూకలపాటి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నెల్లూరు (జడ్పీ), ఏప్రిల్ 13 (ఆంధ్ర జ్యోతి) : నగరంలోని మూలాపేట వేణుగోపాల్ స్వామి, ఉస్మాన్‌సాహెబ్‌పేట కోదండ రామస్వామి రథోత్సవాల సందర్భంగా సోమవారం ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తు న్నట్లు విద్యుత్ శాఖ ఈఈ ఎం శ్రీధర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వేణుగోపాల స్వామి రథోత్సవం నేపథ్యంలో కొండదిబ్బ, అలంకార్ సెంటర్, బ్రాహ్మణ వీధి, రాజావారి వీధి, శివాలయం సెంటర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. కోదండరామస్వామి రథోత్సవం సందర్భంగా ఉస్మాన్‌సాహెబ్ పేట శివాలయం వీధి, రేబాల వారి వీధి, పప్పులవీధి, తడికల బజార్, ఎన్‌డీఆర్ లేఅవుట్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

స్మైల్‌వాకర్స్ వైద్యశిబిరం

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో స్మైల్ వాకర్స్ ఆధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఆర్థోపెడిక్ డాక్టర్ షేక్ నవాజ్ షరీఫ్, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ మధులేఖ వాకర్స్‌కు పరీక్షలు నిర్వహించి మందులు అందచేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు సయ్యద్ మదార్, కార్యదర్శి షేక్ అజ్మీర్‌బాషా, కోశాధికారి బీ నారాయణ పాల్గొన్నారు.

జనసేన చలివేంద్రం

నెల్లూరు(వ్యవసాయం), ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): అన్నదాత డొక్కా సీతమ్మ స్ఫూర్తితో నగరంలో ఆదివారం జనసేన కోర్ కమిటీ సభ్యుడు నూనె మల్లికార్జున యాదవ్ చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్ర మంలో పార్టీ నాయకులు గునుకుల కిషోర్, చంద్రశేఖర్‌రెడ్డి, జమీర్, సుధామాధవ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి అగ్నిమాపక వారోత్సవాలు

● ఫైర్ అధికారి విజయ వరకుమార్

పొదలకూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : అగ్నిమాపక వారోత్సవాలు సోమవారం నుంచి ఈ నెల 20వతేదీ వరకు జరుగుతాయని, వీటిని విజయవంతం చేయాలని స్థానిక అగ్నిమాపక శాఖాధికారి టీ విజయ వరకుమార్ కోరారు. ఆదివారం ఆయన వివరాలు వెల్లడించారు. సోమవారం ఉదయం పొదలకూరు ఫైర్ ఆఫీసులో కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని చెప్పారు. అగ్ని ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించి, ప్రమాదాల నివారణ చర్యలను తెలియజేస్తామన్నారు. మండలంలో అగ్ని ప్రమాదాలు సంభవిస్తే 08621-225202, 99637 34828 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

రూ. 2.70 కోట్లతో గాంధీనగర్ రోడ్డు

● రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, ఏప్రిల్ 13, (ఆంధ్ర జ్యోతి) : నగరంలోని గాంధీనగర్ రోడ్డును రూ.2.70 కోట్లతో నిర్మించేందుకు త్వరలో శంకుస్థాపన చేస్తామని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఈ రోడ్డును ఆయన పరిశీలించారు. నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి విగ్రహం నుంచి బైపాస్‌రోడ్డు వరకు రహదారిని ఆధునీకరిస్తామని తెలిపారు. దీంతోపాటు డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గాంధీనగర్ రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి

మార్కెట్‌ను కమ్మేస్తున్నారు!

● వ్యాపారుల ఇష్టారాజ్యం ● దుకాణాలు దాటి ముందుకు...
● దీనికితోడు వాహనాల రాకపోకలు.. నడిచేందుకూ ఇబ్బంది
● కొనుగోలుదారులకు తీవ్ర అసౌకర్యం ● ఏళ్లుగా ఇదే పరిస్థితి...
● అధికారులు హెచ్చరించినా ఆ ఒక్కరోజే..





మార్కెట్‌లో దుకాణాల హద్దు దాటి ముందుకు చొచ్చుకొచ్చిన వ్యాపారులు (ఇన్‌సెట్) మార్కెట్‌లోకి వెళుతున్న ద్విచక్ర వాహనం

నెల్లూరు(వ్యవసాయం), ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రధాన కూరగాయల మార్కెట్ రోజురోజుకు ఇరుకైపోతోంది. మార్కెట్ పెద్దదే అయినా వ్యాపారులు హద్దులు దాటి ముందుకు చొచ్చుకు వచ్చి దారిని ఆక్రమించేస్తున్నారు. దుకాణానికి ముందు వినియోగదారులు రాకపోకలు సాగించే మార్గంలో పెట్టెలు ఏర్పాటు చేసి అమ్మకాలు సాగిస్తున్నారు. దీంతో నడిచేందుకు కూడా అవకాశం లేని పరిస్థితి నెలకొంది. దీనికితోడు నేరుగా మార్కెట్‌లోకే ద్విచక్రవాహనాలు వస్తుండటం , మార్కెట్ మధ్యలోనే వాహనాల పార్కింగ్ చేయడం వల్ల వినియోగదారులకు తీవ్ర అసౌకర్యం కలుగుతోంది. నిండా కూరగాయలున్న సంచితో ఒకేసారి ఇద్దరు నడవలేనంతగా మార్కెట్‌ను వ్యాపారులు ఆక్రమిం చేస్తున్నారు. కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి కొనసాగుతోందని, అధికారులు ఎందరు మారుతున్నా మార్కెట్‌లో పరిస్థితులు మాత్రం మారడం లేదని కొనుగోలుదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

● **మెయిన్ రోడ్డుపైనే వ్యాపారం**

కొందరు కూరగాయల వ్యాపారులు మార్కెట్ బయట మెయిన్‌రోడ్డుపైనే అమ్మకాలు సాగిస్తున్నారు. ప్రధాన మార్కెట్‌కు అదనంగా కూరగాయల వ్యాపారుల కోసం పక్కనే ఉన్న కోనేరు స్థలంలో దుకాణాలు ఏర్పాటు చేశారు. అయినప్పటికీ కొందరు వ్యాపారులు, రైతులు రోడ్లపైనే వ్యాపారం సాగిస్తున్నారు. త్వరగా సరుకు అమ్ముకోవడానికితోడు, కోనేరు స్థలంలోకి వెళితే మార్కెట్ కమిటీకి చెల్లించాల్సిన యూజర్ చార్జీ రూ.40 నుంచి తప్పించుకోవడం కోసం ఇలా రోడ్డుమీదే దుకాణం పెట్టేస్తున్నారు. పల్లెల నుంచి బుట్టలు, గోతాల్లో కూరగాయలు తెచ్చుకునే వారు ఉదయం 5 నుంచి 9గంటల వరకు వ్యాపారం చేసుకుని గ్రామాలకు వెళ్లిపోతున్నారు. మరికొంత మంది రాత్రి 8 నుంచి 11 గంటల వరకు వ్యాపారాలు చేసుకుంటున్నారు. వీరంతా దాదాపుగా రోడ్లపైనే అమ్మకాలు జరుపుతు న్నారు. అసలే నగరంలో వాహనాల సంఖ్య భారీగా పెరిగి ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతుంటే ఇలా చిరువ్యాపారులు రోడ్డు మీదకు వచ్చేస్తుండ టంతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్ పరిస్థితి మరింత అధ్వానంగా ఉంటోంది.



రోడ్డు పక్కన బారులుతీరిన వ్యాపారులు

● **కొరవడిన పర్యవేక్షణ**

గతంలో జిల్లా ఉన్నతాధికారులు కూరగాయల మార్కెట్‌పై ప్రత్యేక దృష్టి పెట్టడంతో వినియోగదారులకు కొంతమేర అవస్థలు తప్పేవి. వ్యాపారులు వారికి కేటాయించిన స్థలం పరిధిలోనే విక్రయాలు జరిపేలా, ద్విచక్ర వాహ నాలను సైతం మార్కెట్ బయటే నిలిపేలా చర్యలు తీసుకున్నారు. అయితే ప్రస్తుతం అపరిస్థితి లేకుండా పోయింది. అధికారులు, సూపర్ వైజర్లు వచ్చిన సమయాల్లో దారికి అడ్డంగా ఉన్న దుకాణాలను తొలగిస్తున్నారు. వారు తిరిగి వెళ్లగానే మళ్లీ దుకాణాలను ముందుకు జరిపేస్తున్నారు. నిత్యం అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, దీంతో మార్కెట్‌లో తిరగలేకపోతున్నామని వినియోగదారులు వాపోతున్నారు.

మార్జిన్లు ఏర్పాటు చేస్తున్నాం

మార్కెట్‌లో సమస్యల పరిష్కారం కోసం ఇప్పటికే వ్యాపార సంఘాల నాయకులతో చర్చించాం. కొన్ని మార్పులు చేయబోతున్నాం. వీటికి అందరూ సమ్మతించారు. ప్రతి దుకాణానికి ఒక మార్జిన్ ఏర్పాటు చేస్తున్నాం. ఆ పరిధిలోనే వ్యాపారం చేసుకోవాలి. అది దాటితే చర్యలు తీసుకుంటాం. ద్విచక్ర వాహనాల పార్కింగ్‌కు సమీపంలోని ఓ ప్రదేశం ఏర్పాటు చేస్తున్నాం. దీనిపై నగర పాలక సంస్థతో చర్చించాం. ప్రతిరోజు ఇద్దరు సూపర్‌వైజర్లు మార్కెట్‌లో తిరుగుతూ పర్యవేక్షిస్తున్నారు. దారికి అడ్డంగా దుకాణాలు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. రోడ్లపైన వ్యాపారాలు సాగించేవారిపై పోలీసులు, నగర పాలక సంస్థ అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. కోనేరు మార్కెట్‌లో స్థలం ఉన్నా వారు రావడం లేదు.

- ఎం శ్రీనివాసులు, మార్కెటింగ్ శాఖ ఉన్నతశ్రేణి కార్యదర్శి

ఘనంగా మట్టల ఆదివారం

ముత్తుకూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : ముత్తుకూరులోని సిలోయం బాప్టిస్ట్ చర్చి ఆధ్వర్యంలో మట్టల ఆదివారం వేడుకలు జరిగాయి. క్రైస్తవులు భక్తిగీతాలు పాడుతూ ర్యాలీ నిర్వహించారు. ముందుగా చర్చిలో సంఘ స్థాపకుడు బూదూరు అబ్రహం ప్రార్థనలు చేశారు. పాస్టర్ కొఠారూ టెర్తులియన్‌పాల్ మాట్లాడుతూ ఏసుక్రీస్తును రాజుగా ఆహ్వానించేందుకు ఈ వేడుకలు జరుపుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ గున్నం ప్రసూన, చర్చి సెక్రటరీ బూదూరు బాలు విన్సెంట్, సభ్యులు విజయవర్ధన్, ప్రవీణ్ కుమార్, నజరేత్, దాసు, రితేష్‌కుమార్ పాల్గొన్నారు.



ముత్తుకూరు : మట్టలతో ప్రదర్శనలో క్రైస్తవులు

కోవూరులో...

కోవూరు, ఏప్రిల్ 13: స్థానిక శారాబిలాక్ చర్చిలో ఆదివారం మట్టల పండుగను ఘనంగా నిర్వహించారు. పాస్టర్ రాజేష్ మట్టల పండుగ విశిష్టతను వివరించారు. అనంతరం పట్టణంలో శారాబిలాక్ మెమోరియల్ సెంటనరీ బాప్టిస్ట్ సంఘం ఆధ్వర్యంలో ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ దివ్యరాజేష్, సంఘ చైర్మన్ కాకాణి రత్నానం దరావు, వైస్ చైర్మన్ షైల ప్రాన్సి స్, సెక్రటరీ టీ. మోహన్, ట్రెజరర్ కుమార్ పాల్గొన్నారు. కాగా స్టాడింగ్ కమిటీ సభ్యులు, స్కూల్ టీచర్స్, సండే స్కూల్ స్టూడెంట్స్ స్త్రీల సమాజం సభ్యులు పాల్గొన్నారు.



కోవూరులో జరిగిన మట్టల పండుగలో పాల్గొన్న చిన్నారులు

శ్రీరాముడి ఆశీస్సులుంటే అన్నీ జరిగిపోతాయి : కోటంరెడ్డి

● నందమూరి బాలయ్య పేరిట రూ.2లక్షలతో వెండి కవచాలు

నెల్లూరు రూరల్, ఏప్రిల్ 13, (ఆంధ్రజ్యోతి) : శ్రీరామ చంద్రుడి ఆశీ స్సులు ఉంటే అన్నీ వాటంతట అవే జరిగిపోతాయని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి అన్నారు. ఆదివారం నగరంలోని బాలాజీనగర్ రామాలయ రథోత్సవంలో కోటంరెడ్డి దంప తులు పాల్గొన్నారు. అనంతరం శ్రీనివాసులురెడ్డి మాట్లాడారు. తన కుమార్తె లక్ష్మీహృషిత సహ కారంతో రూ.లక్ష, బాలకృష్ణ సినిమాల్లోకి వచ్చి 50 ఏళ్లు పూర్తయిన సంద ర్భంగా తాను సొంతంగా మరో రూ.లక్షతో విలువైన వెండి ఆభరణాలను నందమూరి బాలయ్య పేరిట శ్రీరామ చంద్రుడికి అందిస్తు న్నట్లు తెలిపారు. అనంతరం బాలాజీనగర్, ఏసీనగర్ ప్రాంతాలలో శ్రీరాముని రథోత్సవం కనుల పండుబగా సాగింది. భక్తులు భారీగా పాల్గొనగా, జై శ్రీరాం, జైజై శ్రీరాం నామస్మరణ మార్మోగింది.



రథం ముందు డప్పు వాయిస్తున్న నుడా చైర్మన్ కోటంరెడ్డి

పంచాయతీ కార్మికులకు కనీస వేతనాలివ్వాలి

● వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్

ముత్తుకూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని గ్రామ పంచాయతీ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి గడ్డం నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ముత్తుకూరు గ్రామ పంచాయతీ కార్మికుల జనరల్ బాడీ సమావేశం గడ్డం అంకయ్య అధ్యక్షతన శ్రామిక భవన్‌లో ఆదివారం జరిగింది. కార్మికులు చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అధికారులు స్పందించి పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, టెండర్లతో నిమిత్తం లేకుండా వారిని విధుల్లో కొనసాగించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏడుగురితో ముత్తుకూరు మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా టీ రామయ్య, బీ ఆనంద రావు, కోశాధికారిగా మురళీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి గోగుల శ్రీనివాసులు, కే పెంచలనరసయ్య, గడ్డం అంకయ్య, సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.



డిమాండ్లతో కూడిన కరపత్రం విడుదల చేస్తున్ననాయకులు

శభాష్ తన్వీర్!

● ఇంటర్‌లో పొదలకూరు కుర్రోడు టాపర్
● టీవీ మెకానిక్ కుమారుడికి అత్యుత్తమ మార్కులు

పొదలకూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ ఫలితాల్లో పొదలకూరుకు చెందిన టీవీ మెకానిక్ కుమారుడు తన్వీర్ బాషా రాష్ట్రంలో అత్యుత్తమ మార్కులు సాధించి అందరితో శభాష్ అనిపించుకుంటున్నాడు. శనివారం విడుదలైన ఫలితాల్లో 1000 మార్కులకుగాను తన్వీర్ 992 మార్కులు సాధించాడు. పట్టణానికి చెందిన యజ్దాని బాషా, మొబీనా దంపతుల కుమారుడు తన్వీర్. ఇతని తమ్ముడు కూడా ఇంటర్‌లో సత్తా చాటాడు. మొదటి సంవత్సరం చదువుతున్న ఆ విద్యార్థి 470 మార్కులకు గాను 465 సాధించాడు. ఈ సందర్భంగా తన్వీర్ బాషా మాట్లాడుతూ ఇంటర్ తర్వాత ఇంజనీరింగ్ పూర్తి చేసి సివిల్ సర్వీస్ సాధించడమే లక్ష్య మని చెప్పాడు. తన తండ్రి టీవీ మెకానిక్‌గా పని చేస్తూ కష్టపడి చదివిస్తున్నారని, ఆయన ఆశయాలకు అనుగుణంగా అధ్యాపకుల సహకారంతో ఈ మార్కులు సాధించగలిగానన్నాడు. కుమారుడు అత్యుత్తమ మార్కులు సాధించడంతో తన్వీర్ తల్లిదండ్రులు, బంధువుల ఆనందానికి అవధులు లేకుం డాపోయాయి.





పూర్వ విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది

'ఎస్‌వీఆర్'లో తల్లిదండ్రుల సమావేశం

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఎస్‌వీఆర్ పాఠశాలలో ఆదివారం తల్లిదండ్రుల సమావేశం జరిగింది. అతిథిగా హాజరైన విశ్రాంత ఎంఈవో ఎన్ నరసయ్య మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వారితో స్నేహపూర్వకంగా మెలుగుతూ వారి ఉన్నతికి సహకరించాలని కోరారు. ఈ ఏడాది ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించిన పాఠశాల పూర్వ విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ రమేష్‌బాబు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టు స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా మల్లికార్జున్

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్ స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఇసనాకుల మల్లికార్జున్‌ను ఆదివారం రాష్ట్ర అధ్యక్షుడు ఓబులం ప్రసాద్ ఎంపిక చేశారు. త్వరలోనే రాష్ట్రస్థాయిలో జర్నలిస్టుల కోసం క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఈ సందర్భంగా మల్లికార్జున్ పేర్కొన్నారు. త్వరలోనే నెల్లూరు జిల్లా స్పోర్ట్స్ అసోసియేషన్ కమిటీని నియమిస్తున్నట్లు తెలిపారు. క్రీడలపై ఆసక్తి కలిగిన విలేకరులు ముందుకు రావాలని వారికి జిల్లా కమిటీలో స్థానం కల్పిస్తామని చెప్పారు.



నేత్రపర్వం... వేణుగోపాలుడి కల్యాణం

నెల్లూరు : మూలాపేట వేణుగోపాల స్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఆదివారం కల్యాణోత్సవం నేత్రపర్వంగా జరిగింది. రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాల స్వామిని కల్యాణ మూర్తులుగా అలంకరించి ఎదురుకోలు ఉత్సవం, మాలల మార్పిడి అనంతరం కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో సోమవారం స్వామివారి రథోత్సవం జరగనుంది.

కమనీయం.. వరదరాజస్వామి కల్యాణం

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడలో జరుగుతున్న బ్రహోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి వరదరాజస్వామివారికి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లు గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం తిరుచ్చి ఉత్సవం జరిగింది. ముందుగా ఆలయంలో అర్చక స్వామి తేజాస్వరూప్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● **కోదండరాముడికి అశ్వవాహన సేవ**

బుచ్చి పెద్దూరులో జరుగుతున్న బ్రహోత్సవాల్లో భాగంగా ఆదివారం కోదండరామ స్వామి వారు అశ్వవాహనంపై గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి ఉదయం తిరుచ్చి ఉత్సవం జరిగింది. కార్యక్రమాలను వ్యవస్థాపక ధర్మకర్త దొడ్ల మురళీకృష్ణారెడ్డి పర్యవేక్షించారు.

● **బందోబస్తు మధ్య వసంతోత్సవం**

మండలంలోని సాల్మానుపురంలో ఆదివారం రాములవారి వసంతోత్సవం పోలీసు బందోబస్తు మధ్య జరిగింది. గత జనవరిలో గ్రామంలోని సెంటర్‌లో కూటమి ఫ్లెక్సీని తగులపెట్టగా, శనివారం రాత్రి, మళ్లీ ఆదివారం ఉదయం కూడా ఫ్లెక్సీని తగులబెట్టారు. ఈ క్రమంలో ఓ యువకుడికి కూటమి నాయకుల మధ్య వివాదం జరిగింది. దీంతో కూటమి నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ యువకుడిని స్టేషన్‌కు తీసుకెళ్లిన పోలీసులు వెంటనే వదిలేశారు. ఈ నేపథ్యంలో గ్రామంలో రాముల వారి వసంతోత్సవం సందర్భంగా బందోబస్తు నిర్వహించారు. కాగా యువకులు ఆనందోత్సాహాలతో ఒకరిపై ఒకరు వసంతాలు పోసుకున్నారు. కార్యక్రమం ప్రశాంతంగా జరిగింది.



సాల్మానుపురంలో వసంతం పోసుకుంటున్న యువకులు




విశేష అలంకరణలో కల్యాణమూర్తులుగా శ్రీదేవి, భూదేవి సమేత వరదరాజస్వామి

భక్తిశ్రద్ధలతో రాములోరి రథోత్సవం

పొదలకూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ఆదివారం సీతారాముల రథోత్సవం భక్తిశ్రద్ధలతో జరిగింది. స్థానిక రామమందిరం వద్ద నుంచి బయలుదేరిన రథం పట్టణంలోని ప్రధాన వీధుల్లో సాగింది. దారి పొడవునా భక్తులు టెంకాయ, కర్పూరం ఇచ్చి సీతారాములను దర్శించుకున్నారు. తరుగు ప్రభాకర్ కుటుంబం ఉభయకర్తలుగా వ్యవహరించారు.







అలాంటి వ్యక్తి భూమ్మీద పుట్టకూడదు

"ఆయన హిందువు కాదు. కుమార్తెకు ఏ సంప్రదాయం ప్రకారం వివాహం చేశారో అందరికీ తెలుసు. హిందూ వ్యతిరేక వ్యక్తి గతంలో టీటీడీ ఛైర్మన్ కావడం మనందరి దురదృష్టకరం. గడువు అయిపోయిన మందులు, పురుగులు పట్టిన దాణా ఇచ్చిన వ్యక్తి గోవుల గురించి మాట్లాడుతున్నారు. ఇలాంటి వ్యక్తి భూమిపై పుట్టకూడదని స్వామివారిని కోరుకుంటున్నా. దేవుడి సొమ్ము తిన్న వారిని తప్పకుండా భగవంతుడు శిక్షిస్తాడు."

- బీఆర్ నాయుడు, టీటీడీ ఛైర్మన్, తిరుపతి గోశాలలో..



గోవుతో, గోవిందుడితో ఆడుకోవద్దు

"రాజకీయ ప్రయోజనాల కోసం గోవుతోనూ, గోవిందుడితోనూ ఆడుకోవద్దు. గతంలో రెండుసార్లు టీటీడీ ఛైర్మన్‌గా, సభ్యుడిగా పని చేసిన వ్యక్తి, అబద్ధపు ప్రచారాలతో భక్తుల మనోభావాలు దెబ్బతీస్తున్నారు. టీటీడీ ప్రతిష్ఠను దిగజార్చమే అజెండా పెట్టుకున్నారు. ఎక్కడో జరిగిన గో మరణాలను ఇక్కడ జరిగినట్టు చూపిస్తున్నారు. టీటీడీ ప్రతిష్ఠను దిగజార్చేలా వ్యవహరించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోబోతున్నాం."

- టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, తిరుమలలో..



ఇది హిందువులపై కుట్ర

"దేవుడు లేడు, వేంకటేశ్వర స్వామి ఓ నల్లరాయి. నల్లరాయిపైన చెప్పుతో వేస్తే 'ఏమవుతుంది' అని మాట్లాడిన కరుణాకరరెడ్డి టీటీడీ ఛైర్మన్ అయ్యాక టీటీడీ నిధుల్లో కమీషన్లు ఎలా తీసుకున్నారో అందరికీ తెలుసు. ఇలాంటి వ్యక్తి హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా కుట్ర చేస్తున్నారు. కల్తీ నెయ్యి వ్యవహారంలోనూ వైవీ సుబ్బారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, ఈవో ధర్మారెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిల పాత్ర ఉంది. వీటన్నింటికీ తగిన మూల్యం చెల్లించక తప్పదు"

- చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని

పడమర సరే
తూర్పు మాటేమిటి?

శ్రీకాళహస్తి పట్టణ శివారు రాజీవ్‌నగర్‌లో ఆక్రమణల తొలగింపులో రెవెన్యూ అధికారులు అనుసరిస్తున్న తీరు విమర్శలకు దారితీస్తోంది. రోడ్డుకు పడమర వైపున 120 అక్రమ నిర్మాణాలను ఏకకాలంలో కూల్చివేసి, తూర్పు వైపునకు వచ్చే సరికి దోబోచులాడుతుండడం అనుమానాలకు తావిస్తోంది.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

ఆక్రమణల తొలగింపులో వివక్ష
కొన్నింటిని కూల్చేసి.. మరికొన్నింటిపై మీనమేషాలు
శ్రీకాళహస్తి రెవెన్యూ అధికారుల తీరుపై విమర్శలు



రాజీవ్‌నగర్‌లో తూర్పు వైపున అక్రమ నిర్మాణాలు

శ్రీకాళహస్తి శివారులోని రాజీవ్‌నగర్ కాలనీ 2005లో ఏర్పాటైంది. 7వేల మంది పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేశారు. అప్పట్లో సరైన అవగాహన లేకపోవడం, బిల్లులు సకాలంలో రాకపోవడం వంటి కారణాలతో లబ్ధిదారులు ఎవరన్నది స్పష్టత లేకపోయింది. 2014లో టీడీపీ ప్రభుత్వం వచ్చాక అప్పటి కలెక్టర్ పర్యవేక్షణలో సమగ్ర సర్వే నిర్వహించారు. 2014 నుంచి 2019 వరకు రాజీవ్‌నగర్‌లో నిర్మాణాల సంఖ్య గణనీయంగా పెరిగింది. దీంతో కబ్జాదారుల కళ్లు ఆ స్థలాలపై పడ్డాయి. టీడీపీ ప్రభుత్వం ఉన్నంత వరకు వారి ఆటలు సాగలేదు. 2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చాక అక్రమార్కులకు రాజీవ్‌నగర్ వరంగా మారింది. ఖాళీజాగా కనిపిస్తే పాగా వేసేశారు. అడ్డు వచ్చిన లబ్ధిదారులపై దాడులకు తెగబడ్డారు. ఇళ్ల స్థలాలు కేటాయించే సమయంలో పిచ్చాటూరు రహదారికి ఆనుకుని రోడ్డుకు ఇరువైపులా భవిష్యత్తు అవసరాల కోసం విస్తారంగా స్థలం వదలిపెట్టారు. వైసీపీ నేతలు రోడ్డుకు పడమర వైపున ఖాళీ స్థలాలు ఆక్రమించి, అమ్మిసొమ్ము చేసుకున్నారు. దీనిపై స్థానికులు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆక్రమణలు తొలగిస్తామని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి వారికి హామీ ఇచ్చారు. ఆ ప్రకారం ప్రభుత్వం ఏర్పాటయిన వెంటనే రోడ్డుకు పడమర వైపు దౌర్జన్యంగా నిర్మించిన 120 కట్టడాలను అధికారులు కూల్చివేశారు.

అటువైపు ఆక్రమణల మాటేమిటి?

రాజీవ్‌నగర్‌లో పిచ్చాటూరు రహదారికి ఆనుకుని తూర్పువైపున అక్రమార్కులు పెద్దయెత్తున కబ్జాలు చేశారు. రోడ్డు నుంచి ఇళ్ల స్థలాలకు మధ్యలో కొంత ప్రభుత్వ భూమిని వదిలిపెట్టారు. దీనిపై కన్నేసిన వైసీపీ నేతలు అప్పటి రెవెన్యూ అధికారుల అండతో ఖాళీ స్థలాల్లో పెద్దయెత్తున దుకాణాలు నిర్మించి, విక్రయించి సొమ్ము చేసుకున్నారు. పైగా ఇళ్లు కట్టుకున్న వారిని భయభ్రాంతులకు గురిచేసి స్థలాలను స్వాహా చేస్తున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది.



కిక్కిరిసిన ముక్కంటి ఆలయం

ముక్కంటి ఆలయం ఆదివారం కిక్కిరిసింది. మూడు రోజుల పాటు వరుస సెలవులు రావడం, ఇంటర్ ఫలితాలు వెలువడడంతో భక్తుల తాకిడి పెరిగింది. శనివారం రాత్రి పట్టణంలోని లాడ్జిలన్నీ భక్తులతో నిండిపోయాయి. ఆదివారం వేకువజాము నుంచి ముక్కంటి ఆలయాన్ని దర్శించుకునేందుకు భక్తులు క్యూలలో బారులు తీరారు. ఉదయం నుంచి రాత్రి వరకు సుమారు 30 వేల మంది దర్శించుకున్నట్లు అధికారుల అంచనా. దళారులు అడ్డదారిలో ప్రవేశించకుండా అధికారులు కట్టుదిట్టంగా వ్యవహరించడంతో సామాన్య భక్తులు సంతృప్తికరంగా దర్శించుకున్నారు. ఈవో బాపిరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. మొత్తం ఐదు విభాగాల్లో 5723 రాహు కేతు పూజలు జరిగాయి. రూ.50 శీఘ్ర దర్శనం టికెట్లు 4312, రూ.200 ప్రత్యేక ప్రవేశ దర్శనం 4312 టికెట్లను భక్తులు కొనుగోలు చేశారు. అంతరాలయ దర్శనం టికెట్లు రికార్డు స్థాయిలో భక్తులు కొనుగోలు చేశారు. అంతరాలయ దర్శనం కోసం భక్తులు దళారులను ఆశ్రయించకుండా అడ్డుకట్ట వేసేందుకు రెండు నెలల క్రితం రూ.500 టిక్కెట్లను ప్రవేశ పెట్టిన విషయం తెలిసిందే. మెల్లగా ఈ టిక్కెట్ల కొనుగోళ్లు పెరుగుతున్నాయి. ఆదివారం ఒక్క రోజే 618 టికెట్ల విక్రయాలు జరిగాయి.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి



కుమారుడి కోసం మొక్కు చెల్లించి..!

సింగపూర్‌లో జరిగిన అగ్నిప్రమాదం నుంచి తమ కుమారుడు మార్క్ శంకర్ సురక్షితంగా బయటపడటంతో శ్రీవారికి మొక్కు చెల్లించుకునేందుకు ఆదివారం సాయంత్రం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సతీమణి అన్నా లెజినోవా తిరుమలకు వచ్చారు. టీటీడీ నిబంధనల ప్రకారం డిక్లరేషన్‌పై సంతకం చేసిన ఆమె వరాహస్వామిని దర్శించుకున్నారు. అనంతరం శ్రీవారికి మొక్కుగా తలనీలాలు సమర్పించారు.

- ఆంధ్రజ్యోతి, తిరుమల

2 నెలలు
4 వేల కేసులు

డ్రంకెన్ డ్రైవ్‌పై పోలీసుల కఠిన వైఖరి



తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనం నడిపే వారిపై పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. డ్రంకెన్ డ్రైవ్ వల్లే అత్యధిక ప్రమాదాలు జరుగుతున్నట్లు గుర్తించిన పోలీసులు.. ఆ దిశగా ఉక్కుపాదం మోపుతున్నారు. ఫలితంగా ఎక్కువ కేసులు నమోదవుతున్నాయి. ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ 12వ తేది వరకు మద్యం తాగి బండి నడిపిన నాలుగు వేల మందిపైన కేసులు నమోదుచేశారు. ఇందులో జిల్లాలోని వివిధ కోర్టుల ద్వారా దాదాపు 210 మందికి జైలు శిక్షలు పడ్డాయి. ఈ కేసుల ద్వారా దాదాపు రూ. 32.30 లక్షలు జరిమానా రూపంలో వసూలు చేసినట్లు సమాచారం. డ్రంకెన్ డ్రైవ్ కేసులో తొలి రెండు సార్లు పట్టుబడితే రూ.పది వేల చొప్పున న్యాయస్థానం జరిమానా విధిస్తోంది. మూడోసారి పట్టుబడితే జైలు శిక్ష విధిస్తున్నారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై కఠినంగా వ్యవహరించాలని ఎస్పీ హర్షవర్ధనరాజు ఆదేశించడంతో.. పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. సాయంత్రం 5 గంటలైందంటే జిల్లాలోని చాలా సర్కిళ్ళు, జన సమర్థమైన ప్రాంతాలలో పోలీసులు బ్రీత్ అనలైజర్లతో తనిఖీలు చేపట్టారు. ఎక్కువ రీడింగ్ వచ్చిన వారిపై కేసులు నమోదుచేసి స్లిప్పులు చేతిలో పెడుతున్నారు. ఎవరైనా న్యూసెన్స్ చేసే ప్రయత్నంచేసినా పొలిటికల్ ముసుగులో వార్నింగ్‌లు ఇచ్చినా బాడీ ఓన్ కెమెరాల ద్వారా వీడియోలు తీసి కోర్టుల ముందు ఎవిడెన్స్ పెడుతున్నారు.

ఆరు డ్రోన్లు వచ్చాయోచ్

- అత్యాధునిక టెక్నాలజీతో ఆకతాయిల ఆటకట్టు
- ట్రాఫిక్, నేర నియంత్రణకు ప్రాధాన్యం



డ్రోన్‌ను ఎగురవేసి పనితీరును గమనిస్తున్న ఎస్పీ హర్షవర్ధనరాజు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు శాఖకు ఆరు డ్రోన్లు వచ్చాయి. తిరుపతి నగరం, జిల్లా ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని కలెక్టర్ వెంకటేశ్వర్లు పోలీస్ శాఖకు రూ.30 లక్షలు ప్రత్యేకంగా విడుదల చేశారు. వీటిలో రూ.15 లక్షలు వెచ్చించి ఆరు డ్రోన్లు కొనుగోలు చేయగా.. మిగిలిన రూ.15 లక్షలతో సీసీ కెమెరాలు కొననున్నారు. కాగా, ఆదివారం పోలీసు పరేడ్ మైదానంలో ఈ డ్రోన్ల పనితీరును ఎస్పీ హర్షవర్ధనరాజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన నిధులు విడుదల చేసిన కలెక్టర్ వెంకటేశ్వర్లుకు ధన్యవాదాలు తెలిపారు. జిల్లాకు వచ్చిన ఆరు డ్రోన్లలో.. నాలుగు మ్యాట్రిస్, ఒక థర్మల్ డ్రోన్స్ కెమెరా, మరొకటి మ్యావిక్ ఎయిర్ 3ఎస్-05 కెమెరా ఉన్నాయి.మ్యాట్రిస్-4 థర్మల్ డ్రోన్ కెమెరా ఒక కిలోమీటరు ఎత్తు వరకు ఎగురుతుంది. నగరాల పరిధిలో రెండు నుంచి మూడు కిలో మీటర్ల వరకు ఖాళీ ప్రదేశాల్లో 3-4 కిలోమీటర్ల దూరం వరకు వెళుతుంది. ఇందులో థర్మల్ ఇమేజింగ్ ఉంటుంది. దీంతో 48 మెగా పిక్సల్‌తో మూడు కెమెరాలు ఉన్నాయి. నైట్ మోడ్ ఏఐ కెమెరా ద్వారా హెడ్ కౌంట్, వాహనాల రాకపోకలను కౌంట్ చేస్తుంది. థర్మల్ కెమెరా ద్వారా అడవుల్లోని మనుషులను, జంతువులను గుర్తించవచ్చు. ఎక్కడైనా అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు థర్మల్ కెమెరాను ఉపయోగించి మనుషులు ఎవరైనా ఉన్నారా అని గుర్తించవచ్చు. సర్వేలెన్స్, మానటరింగ్ ఆఫ్ పబ్లిక్, ట్రాఫిక్ మానిటరింగ్ చేసుకోవచ్చు. వీటితో పాటు పబ్లిక్ అనౌన్స్‌మెంట్ చేసుకోవచ్చు. ఈ డ్రోన్లను ఎలా ఉపయోగించాలి, అవసరాన్ని బట్టి డేటా ఎలా సేకరించాలి అనే విషయాలపై ఇప్పటికే 40 మంది పోలీసులకు శిక్షణ ఇప్పించినట్లు ఎస్పీ చెప్పారు. ఈ కార్యక్రమంలో సైబర్ క్రైం సీఐ వినోద్‌కుమార్, ఆర్ఐ రమణారెడ్డి పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో పార్టీలు నిర్వహిస్తే చర్యలు

జిల్లాలో ఎక్కడైనా బహిరంగ ప్రదేశాల్లో బర్త్‌డే పార్టీలు, ఇతర నిషేధిత కార్యక్రమాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హర్షవర్ధనరాజు హెచ్చరించారు. తిరుపతిలో ఆదివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా పోలీసు తనిఖీలు ఉంటాయన్నారు. కొత్తగా వచ్చిన ఆరింటితో పాటు మొత్తం ఏడు డ్రోన్లు పోలీసు శాఖకు అందుబాటులో ఉన్నాయన్నారు. జిల్లాలో నేరాలు, ట్రాఫిక్ ఎక్కువగా ఉన్న ప్రాంతాలు, ఓపెన్ బూజింగ్, గంజాయి విక్రయాలు, వినియోగం వంటి వాటిని నియంత్రించడానికి ఉపయోగిస్తామన్నారు. ఎవరైనా చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే పోలీసు కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

రాంగ్ రూట్ కేసులు 359

జిల్లా వ్యాప్తంగా మార్చి నుంచి ఏప్రిల్ 12వ తేది వరకు రాంగ్ రూట్‌లో వచ్చిన వారిపై 359 కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ హర్షవర్ధనరాజు ఆదివారం తెలిపారు. తద్వారా రూ.12.40 లక్షల అపరాధ రుసుం వసూలు చేశామన్నారు. ఓపెన్ బూజింగ్ ద్వారా 3145 కేసులు నమోదు కాగా వీటిలో 3202 మందికి జరిమానాలు విధించామన్నారు. 11 కేసులకు సంబంధించి 119.05 కిలోల గంజాయి సీజ్ చేసి.. 26 మందిని అరెస్టు చేశామన్నారు.

వాతావరణం అనుకూలించక..!

- చెన్నైలో ల్యాండ్ అయిన ఇండిగో విమానం

రేణిగుంట, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): రేణిగుంట విమానాశ్రయంలో ఆదివారం రాత్రి 8 గంటలకు ల్యాండ్ కావాల్సిన ఇండిగో విమానం ఈదురుగాలులతో వాతావరణం అనుకూలించక 20 నిమిషాలు గాలిలో చక్కర్లు కొట్టింది. ఆ తర్వాత చెన్నైలో ల్యాండ్ అయి.. అనంతరం రాత్రి 11.10 గంటలకు రేణిగుంటకు చేరింది. 11.45 గంటలకు హైదరాబాద్‌కు బయలుదేరాల్సి ఉండగా.. 12 గంటలకు బయలుదేరింది.

తిరుపతి- విశాఖ మధ్య వేసవి ప్రత్యేక రైళ్లు

తిరుపతి(సెంట్రల్) ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి): వేసవి రద్దీ నేపథ్యంలో విశాఖపట్నం నుంచి తిరుపతి మధ్య 14 ప్రత్యేక రైళ్ల రాకపోకలు మే 29వ తేదీ వరకు రాకపోకలు సాగిస్తాయని సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ తెలిపారు. విశాఖపట్నం- తిరుపతి.. ప్రత్యేక రైలు (08547) 16 నుంచి మే 28వ తేదీ వరకు ప్రతి బుధవారమూ విశాఖలో.. మరో ప్రత్యేక రైలు (08548) 17 నుంచి మే 29వ తేదీ వరకు తిరుపతిలో ప్రతి గురువారమూ బయలుదేరుతుందని తెలిపారు. విశాఖపట్నం-బెంగళూరు మధ్య 14 ప్రత్యేక రైళ్లు విజయవాడ, రేణిగుంట, జోలార్‌పేట, కుప్పం మీదుగా రాకపోకలు సాగిస్తాయని వివరించారు.

శిలాతోరణం సర్కిల్ దాకా క్యూలైన్



సర్వదర్శనం క్యూలో భక్తులు

తిరుమలలో రద్దీ బాగా పెరిగింది. వేంకటేశ్వరస్వామి దర్శనానికి 18 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2 లోని అన్ని కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు. శుక్రవారం హుండీ ఆదాయం రూ.3.33 కోట్లు రాగా.. శనివారం 72,923 మంది స్వామిని దర్శించుకోగా, 35,571 మంది తలనీలాలు సమర్పించారు.

- ఆంధ్రజ్యోతి, తిరుమల



శ్రీవారి సేవలో మీనాక్షి

తిరుమల శ్రీవారిని ఆదివారం ఉదయం దర్శించుకుని వస్తున్న సినీ నటి మీనాక్షి చౌదరి.

వైభవోపేతంగా కల్యాణోత్సవం



అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు

గూడూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోనేటిమిట్టలోని కోదండ రామాంజనేయస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించి విశ్వక్సేనా ప్రార్ధన, నిత్యహోమం, ఉక్తహోమం, బలిహరణ పూజలు చేశారు. రాత్రికి స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ వైభోపేతంగా కళ్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం స్వామివారిని విశేషంగా అలంకరించి గజవాహనంపై ఉంచి మంగళవాయిద్యాల నడుమ గ్రామోత్సవం జరిపారు. చంద్రశేఖర్, సుహాసిని, దేవీవరప్రసాద్ కుటుంబసభ్యులు ఉభయదాతలుగా వ్యవహరించారు.

టీటీడీని భ్రష్టు పట్టించింది భూమనే: కురుగొండ్ల



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

వెంకటగిరి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): టీటీడీని మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి భ్రష్టు పట్టించారని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ధ్వజమెత్తారు. ఆదివారం ఆయన తన నివాసంలోని టీడీపీ కార్యాలయంలో మీడియాతో మాటాడుతూ గత వైసీపీ ప్రభుత్వం అన్యమతస్థులను టీటీడీ చైర్మన్లుగా నియమించిందని ఆరోపించారు. టీటీడీ గోశాలలో ఆవులు మృతి చెందాయంటూ అసత్య ప్రచారం చేస్తున్న భూమనను ఉరితీసినా పాపం లేదన్నారు. పవిత్రమైన తిరుమల తిరుపతి దేవస్థానాన్ని రాజకీయాలకు వాడుకోవడం దుర్మార్గమన్నారు. జనసేన పార్టీ కన్వీనర్ జంపాల ప్రకాష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సామాన్య భక్తుల పెద్దపీట వేసిందన్నారు. దేవదేవుడుతో ఆటలొద్దని ఏఎంసీ మాజీ చైర్మన్ పులికల్లు రాజేశ్వరరావు వైసీపీ నేతలకు హితవు చెప్పారు. సమావేశంలో బాలాయపల్లి, డక్కిలి మండలాల టీడీపీ అధ్యక్షులు రావి మస్తాన్ నాయుడు, పోలంరెడ్డి వెంకటరెడ్డి, నాయకులు బీరం రాజేశ్వరరావు, అవ్వారు సత్యనారాయణ, కాపా శ్రీనివాసులు నాయుడు, అనిల్ రామారావు పాల్గొన్నారు.

గోశాలపై అసత్య ఆరోపణలు మానండి

పెళకూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): టీడీడీ గోశాలలోని గోవుల మరణాలపై వైసీపీ చేస్తున్న అసత్య ఆరోపణలు మానుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, స్వర్ణముఖినది ఆనకట్ట ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దామెర ప్రసాద్‌నాయుడు పేర్కొన్నారు. ఆదివారం కొత్తూరు టీడీపీ కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడారు. వయసు పైబడి అనారోగ్యంతో గోవులు మరణిస్తే వాటిపై వైసీపీ నాయకులు విషప్రచారం చేయడం దుర్మార్గమన్నారు. బంగారంపేట సర్పంచు, పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర కార్యదర్శి దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ గోశాలలో గోవులు చనిపోయాయని అసత్య ఆరోపణలు చేసిన టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలన్నారు.

గజవాహనంపై సంగమేశ్వరుడు

కోట, ఏప్రిల్ 13: మండల పరిధిలోని గూడలిలో వెలసిన కామాక్షీదేవి సమేత సంఘమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారు గజవాహనంపై ఊరేగాడు. వేదపండితులు స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేసి గజ వాహనంపై ఉంచి గూడలి పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు అడుగడుగునా కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. అంతకుముందు కామాక్షీదేవి, సంగమేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహించారు.

సర్వేంద్రియానం నయనం ప్రధానం

వెంకటగిరి టౌన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మానవుడి శరీరంలో కళ్లు ఎంతో ప్రధానమైనవని సుశీల నేత్రాల డాక్టర్ సుధాకర్ అన్నారు. ఆదివారం స్థానిక కుమ్మరగుంట వద్ద సాయిబాబా ఆశ్రమంలో ఉచిత కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. 255 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. 108 మందికి శుక్లాల ఆపరేషన్ ఉచితంగా చేస్తామని డాక్టర్ సుధాకర్ చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ అపర్ణ, సిబ్బంది మునిరాజా తదితరులు పాల్గొన్నారు.

అత్యాచార యత్నం కేసు నమోదు

చిట్టమూరు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): రాత్రి ఒంటరిగా నిద్రిస్తున్న వివాహితపై అత్యాచార యత్నం చేసిన వ్యక్తిపై ఆదివారం రాత్రి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు... మండలంలో ఓ గ్రామానికి చెందిన వివాహిత శనివారం రాత్రి ఇంట్లో ఒంటరిగా నిద్రిస్తున్న సమయంలో అదే గ్రామానికి చెందిన వెంకటేష్ అత్యాచార యత్నం చేశాడు. బాధితురాలు కేకలు వేయడంతో పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిన్న బలరామయ్య తెలిపారు.

యువకుడిపై పోక్సో కేసు

బాలాయపల్లి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) మండలంలోని మల్లెమాల గ్రామానికి చెందిన పోలయ్య అనే యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు... వెంకటగిరికి చెందిన ఓ బాలిక నాయుడుపేట మండలంలోని మేనకూరు వద్ద ఓ పరిశ్రమలో పనిచేస్తోంది. అదే ప్రాంతంలో మరో పరిశ్రమలో పనిచేస్తున్న పోలయ్య బాలికతో పరిచయం పెంచుకున్నాడు. పెళ్లి చేసుకుంటానని చెప్పి లైంగిక దాడికి పాల్పడ్డాడని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఆధునిక వైద్యరంగం గాడి తప్పింది

తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ఆధునిక వైద్యరంగం గాడి తప్పిందని, వ్యవస్థ అత్యంత అమానవీయ స్థితికి చేరుకుందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ఆంధ్ర రాష్ట్రంలో ఆక్యుపంక్చర్ వైద్యానికి ఆద్యులు డాక్టర్ గురుకులమిత్ర సంస్మరణ సభ ఆదివారం తిరుపతిలోని వేమన విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ వైద్యరంగం సామాజిక బాధ్యతను కోల్పోతోందని, ఫార్మా పరిశ్రమ దోపిడీకి సాధనంగా మారిందన్నారు. ఈ పరిస్థితికి ప్రభుత్వాలు నైతిక బాధ్యత వహించా లన్నారు. ప్రభుత్వ వైద్యం బలహీనపడి, కార్పొరేట్ వైద్యం బలపడటానికి కేటాయింపులు తగినంత లేకపోవడమే ప్రధాన కారణమన్నారు. అల్లోపతి, ఆయుర్వేదం, నేచురోపతి, హోమియోపతి, ఆక్యుపంక్చర్, యునాని వైద్య ప్రక్రియలలో ఒకదానికి మరొకటి పోటీ కాదని, దేనికుండే ప్రత్యేకతలు దానికి ఉన్నాయన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందారపు మురళి, ప్రముఖ ఆక్యుపంక్చర్ వైద్యులు బాలాజీ, జాలేశ్వరరావు, రవీంద్ర, జనవిజ్ఞాన వేదిక నాయకులు రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

చర్మ వ్యాధులతో జాగ్రత్త అవసరం

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): చర్మ, సుఖ వ్యాధులు చాలా ప్రమాదకరమని, వాటికి సకాలంలో వైద్యం అందించడం ఎంతో అవసరమని రుయా సూపరింటెండెంట్ రవిప్రభు పేర్కొన్నారు. చర్మవ్యాధులకు సంబంధించిన నూతన వైద్య పద్ధతుల్లో ఇటీవల గణనీయమైన పురోగతిని సాధించామన్నారు. ఎస్వీ వైద్య కళాశాలలో ఆదివారం చర్మ, సుఖవ్యాధులపై వైద్య విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రవిప్రభు మాట్లాడుతూ సోరియాసిస్, తామర వంటి వ్యాధులకు సరైన వైద్యం అందించకపోతే ప్రభావం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. అనంతరం నూతన వైద్య పద్ధతుల గురించి వైద్య విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్, వైద్య విభాగాధిపతులు తిరుపతిరెడ్డి, శ్రీనివాసులు, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

మన్నారుపోలూరు ఆలయంలో రేపు సీతారాముల కల్యాణం

సూళ్లూరుపేట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మన్నారుపోలూరులోని అలఘు మల్లారి కృష్ణస్వామి ఆలయంలో మంగళవారం టీటీడీ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. రాత్రి 7:30నుంచి 8:30 గంటల కల్యాణం జరుగుతుందన్నారు.

రేపు మండల సమావేశం

పెళ్లకూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో ప్రమీలారాణి తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచులతో పాటు అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.


టైక్వాండో క్లబ్ ఏర్పాటు

నాయుడుపేట, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): క్రీడల్లో శిక్షణ కోసం మాస్టర్ టైక్వాండో క్లబ్‌ను నాయుడుపేటలో ఏర్పాటు చేస్తున్నట్లు కోచ్ పవన్ కుమార్ ఆదివారం తెలిపారు. క్రీడల్లో బాలికలు, బాలురుకు శిక్షణతో పాటు వారిలో ప్రతిభను వెలికితీసేలా క్లబ్‌ను ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు.

ప్రశాంతంగా గురుకులం ప్రవేశ పరీక్షలు

చిల్లకూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చిల్లకూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఆదివారం నిర్వహించిన 5వ తరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. 5వ తరగతి ప్రవేశానికి 170 మంది దరఖాస్తు చేసుకోగా 148 మంది, ఇంటర్మీడియట్ ప్రవేశానికి 156 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 137 మంది పరీక్షలకు హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్ సుబ్బారావు తెలిపారు.

కోట: పట్టణంలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశానికి ఆదివారం పరీక్షలు జరిగాయి. 5వ తరగతికి 110మంది, ఇంటర్మీడియట్‌కు 121మంది పరీక్షలు రాశారని ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు తెలిపారు.





ఆధునికీకరించిన ప్లాట్‌ఫారం - స్టేషన్‌లో ఏర్పాటు చేసిన లిఫ్టులు

సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌కు కొత్త హంగులు

- రూ.12 కోట్లతో ఆధునికీకరణ
- ప్రయాణికులకు సకల సౌకర్యాలు
- నెలాఖరులో ప్రారంభానికి సన్నాహాలు



చెంగాళమ్మ ఆలయ నమూనాతో నిర్మించిన రైల్వేస్టేషన్ ముఖద్వారం

సూళ్లూరుపేట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట రైల్వేస్టేషన్ కొత్త హంగులు సంతరించుకుంది. అమృత్ భారత్ పథకం కింద సుమారు రూ.12 కోట్లతో జరుగుతున్న ఆధునికీకరణ పనులు 90 శాతానికి పైగా పూర్తయ్యాయి. ఈ నెలాఖరు కల్లా పనులు పూర్తిచేసి ప్రారంభించేందుకు రైల్వే అధికార వర్గాలు సన్నాహాలు చేస్తున్నారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన షార్, శ్రీసిటీ, మాంబట్టు పారిశ్రామికవాడ కేంద్రమైన సూళ్లూరుపేట శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఇక్కడి రైల్వేస్టేషన్‌ను విస్తరించడంతో పాటు కొత్త హంగులతో మరింత సుందరంగా తీర్చిదిద్దేందుకు దక్షిణ మధ్య రైల్వే అధికారులు అమృత్ భారత్ పథకం కింద ఎంపిక చేసి అభివృద్ధికి శ్రీకారం చుట్టారు.

చెంగాళమ్మ ఆలయ నమూనాతో స్టేషన్ ముఖద్వారం

జిల్లా కేంద్రమైన తిరుపతి రైల్వేస్టేషన్‌ను ఆదర్శంగా తీసుకొని సూళ్లూరుపేటలో ప్రసిద్ధి గాంచిన చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయ నమూనాతో రైల్వేస్టేషన్ ప్రధాన ముఖద్వార నిర్మాణం చేపట్టారు. ముఖద్వారం వెలుపుల గార్డెన్లు, అత్యంత ఆధునిక సీసీ కెమెరాలు, సమాచారాన్ని తెలియజేసే ఎలక్ట్రానిక్ బోర్డులు ఏర్పాటు చేశారు. స్టేషన్ ప్రారంభం నుంచి చివరి వరకు సుందరీకరణ పూర్తయ్యింది.

ప్రయాణికులకు సకల సౌకర్యాలు

రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు సకల సౌకర్యాలు కల్పించారు. మూడు ప్లాట్‌ఫారాలు ఉండగా పడమర వైపు ఒక లిఫ్టు, తూర్పువైపు ఒక లిఫ్టు ఏర్పాటు చేశారు. విశ్రాంతి భవనం, బుకింగ్ కౌంటర్, శుద్ధినీటి ప్లాంట్లు, మరుగుడొడ్లు నిర్మించారు.స్టేషన్‌లో రైళ్ల రాకపోకలు తెలియజేసేందుకు రైల్ ఇండికేషన్ బోర్డు, కోచ్ ఇండికేషన్ బోర్డులు ఏర్పాటు చేశారు. అలాగే ప్లాట్‌ఫారమ్ షెడ్‌ను వెడల్పు చేశారు. ప్రయాణికులకు వాహనాల పార్కింగ్ స్థలాన్ని విస్తరించారు. వాహనాలకు భద్రత కల్పించేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ వ్యవస్థకు అనుసంధానం చేశారు.





విద్యుత్ దీపాలంకరణలో ఆలయం - చలువ పందిళ్లు

నేటినుంచి ఈశ్వరయ్య స్వామి తిరునాళ్ల





ప్రత్యేక అలంకరణలో ఈశ్వరయ్య స్వామి - ఆలయంలో ధ్వజారోహణ పూజలు చేస్తున్న వేదపండితులు

డక్కిలి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన దేవునివెల్లంపల్లి స్తంభాలగిరి ఈశ్వరయ్యస్వామి తిరునాళ్లు సోమవారం నుంచి జరగనున్నాయి. ఈ మేరకు దేవదాయ శాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఆదివారం అంకురార్పణ, ధ్వజారోహణ కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం ఉదయం 4 గంటలకు సుప్రభాత సేవ, 5గంటలకు అభిషేకం, ఉదయ హరతి, 6 గంటలకు గణపతి పూజ, 6 గంటలకు కలశస్థాపన, 8 గంటలకు నవగ్రహ హోమం, పూర్ణాహుతి, 9 గంటలకు స్వామి చిత్రపటం ఊరేగింపు, రాత్రి 8 గంటలకు శివపార్వతుల కల్యాణం, రాత్రి 12 గంటలకు స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తుల గ్రామోత్సవం నిర్వహిస్తారని ఆలయ ఈవో శ్రీనివాసులు తెలిపారు. శివపార్వతుల కల్యాణానికి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పిస్తారు. 15వ తేదీ ఉదయం వసంతోత్సవం, రాత్రి 7 గంటలకు పార్వతీ పరమేశ్వరుల కల్యాణమూర్తుల తెప్పోత్సవం, హారతి నైవేద్యం, 16వ తేదీ ఉదయం ధ్వజారోహణంతో తిరునాళ్లు ముగుస్తాయి. కడప, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల నుంచే కాకుండా తమిళనాడు నుంచి భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేసున్న నేపథ్యంలో రాపూరు, వెంకటగిరి డిపోల నుంచి 12 బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. స్వామివారిని భక్తులు సులభంగా దర్శించుకులా ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఎండలు ఎక్కువగా ఉండడంతో ఆలయం వద్ద చలువ పందేళ్లు, మంచినీటి చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆలయంతో పాటు పరసర ప్రాంతాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. తిరునాళ్లలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. తిరునాళ్లలో ఎలాంటి అవాంచనీయ ఘటనలూ జరగకుండా 139 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ శివశంకర్ తెలిపారు. డైమండ్ డబ్బా, పేకాట, అశ్లీల నృత్య ప్రదర్శన వంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా గట్టి నిఘా ఉంచామన్నారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే ఎంతటి వారైనా వదిలి పెట్టబోమని హెచ్చరించారు.

సీనియర్ జర్నలిస్టు కృష్ణమోహన్ మృతి



గూడూరు అర్బన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్టు కృష్ణమోహన్ అనారోగ్యంలో ఆదివారం మృతిచెందారు. చాలా సంవత్సరాలుగా పలు వార్తా పత్రికలలో జర్నలిస్టుగా ఈయన విధులు నిర్వహించారు. పట్టణంలోని పలువురు జర్నలిస్టులు, ప్రముఖులు కృష్ణమోహన్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

ఆర్థిక సాయం



బాధితుడికి నగదు అందజేస్తున్న శ్రీనివాసులు నాయుడు

చిల్లకూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పున్నపువారిపాళెం గ్రామానికి చెందిన దివ్యాంగుడు వెంకటరామ్‌కు రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ ఫౌండేషన్ శ్రీనివాసులునాయుడు రూ.20వేలు ఆర్థిక సాయం ఆదివారం అందజేశారు. వెంకటరామ్‌కు చెందిన రేకుల ఇంటిపై ఇటీవల గాలికి వేపచెట్టు విరిగి పడడంతో ధ్వంసమైంది. భార్యభర్తలు ఇద్దరూ దివ్యాంగులు కావడంతో తన వంతు ఆర్థికసాయం చేశానని శ్రీనివాసులునాయుడు చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జమీర్‌బాషా పాల్గొన్నారు.

కోటమ్మకు విశేష పూజలు



కోట, ఏప్రిల్ 13: గ్రామ దేవత కోటమ్మకు ఆదివారం విశేష పూజలు జరిగాయి. అమ్మవారికి పలు అభిషేకాలు చేసి చందన, పుష్పాలంకరణలో ఉంచారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

శ్రీరాముడి నగరోత్సవం



నగరోత్సవంలో భక్తులు

నాయుడుపేట, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పట్టణం బ్రాహ్మణవీధిలోని రామాలయంలో శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా ఆదివారం నగరోత్సవం వైభవంగా జరిగింది. భక్తులు పసుపు బట్టలతో వసంతాలు చల్లుకుంటూ నగరోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో కోటా వెంకటేశ్వర్లు గూడూరు కిషోర్, సొల్లేటి చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, దర్శి రమేష్, సొల్లేటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మ జాతర కమిటీ అధ్యక్షుడిగా సుబ్బారావు



నాయుడుపేట, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట గ్రామదేవత పోలేరమ్మ జాతర కమిటీ అధ్యక్షుడిగా నానాబాల సుబ్బారావు నియమితులయ్యారు. ఈ మేరకు ఎమ్మెల్యే డాక్టర్ విజయశ్రీ, టీడీపీ నియోజక ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం ధ్రువీకరించారు.

రాజ్యాంగం అమలుతోనే సామాజిక న్యాయం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగాన్ని పటిష్ఠంగా అమలు చేయడం ద్వారా అంబేడ్కర్ కలగన్న సామాజిక న్యాయం సాధ్యమవుతుందని సంస్కృత వర్సిటీ వీసీ ఆచార్య జీఎస్ఆర్ కృష్ణమూర్తి పేర్కొన్నారు. అంబేడ్కర్ దార్శనికత - రాజ్యాంగం - సామాజిక న్యాయం అంశంపై సంస్కృత యూనివర్సిటీలో చేపట్టిన రెండు రోజుల జాతీయ సదస్సును ఆదివారం ఆయన ప్రారంభించారు. వీసీ మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారానే ప్రజలు స్వేచ్ఛను అనుభవిస్తున్నారని తెలిపారు. అకడమిక్ డీన్ రజనీకాంత్ శుక్లా మాట్లాడుతూ దేశ ప్రజల కోసం జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు అంబేడ్కర్ అని కొనియాడారు. ఫైనాన్స్ ఆఫీసర్ రాధాగోవిందత్రిపాఠి మాట్లాడారు. కార్యక్రమంలో సదస్సు కో-ఆర్డినేటర్ వెంకట్రావు, కో కో-ఆర్డినేటర్ చక్రవర్తి, డాక్టర్ కనపాల కుమార్ పాల్గొన్నారు.

ఉన్నత విద్యాభ్యాసంతోనే ఉజ్వల భవిత

నాయుడుపేట, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఎంచుకున్న రంగాల్లో ఉన్నత విద్యను అభ్యసించడం ద్వార ఉజ్వల భవిష్యత్ ఉంటుందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. నాయుడుపేట సాయిశ్రీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ వార్షికోత్సవం ఆదివారం జరిగింది. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే విజయశ్రీ, పార్ధసారధి దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు తమకు ఆసక్తి ఉన్న రంగాలను గుర్తించి ఆయా రంగాల్లో రాణించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చెర్మన్ షేక్ రఫీ, ఎంఈవో మునిరత్నం, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్, నాయుడుపేట మాజీ సర్పంచ్ గూడూరు ప్రభావతమ్మ, గూడూరు సుధీర్‌రెడ్డి, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు అవదానం సుధీర్, రాజశేఖర్ రెడ్డి, అనూష, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ ప్రతిష్టను దెబ్బతీసింది వైసీపీనే: పాశిం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ప్రతిష్టను దెబ్బతీసిందని వైసీపీ ప్రభుత్వమేనని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో టీటీడీ ప్రతిష్టను పూర్తిగా దిగజార్చి సస్పెండ్ అయిన హరినాథరెడ్డి అనే అధికారి కోసం మాజీ చైర్మన్ కరుణాకర్‌రెడ్డి అసత్య ప్రచారాలు చేయడం సమంజసం కాదన్నారు. ఎప్పుడో చనిపోయిన ఆవుల ఫొటోలను చూపిస్తూ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్న కరుణాకర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలన్నారు. కోట్లాదిమంది భక్తుల మనోభావాలను దెబ్బతీసేందుకే వైసీపీ నాయకులు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, అబ్దుల్‌రహీం, మధుసూదన్‌రెడ్డి, జనార్ధన రెడ్డి, చంద్రమౌళి, ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి భక్తులకు భూమన క్షమాపణ చెప్పాలి: విజయశ్రీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ, పక్కన టీడీపీ నాయకులు సుధాకర్ రెడ్డి, రమేష్ తదితరులు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): తిరుమలలోని గోశాలలో గోవులు మరణించాయని అసత్య ఆరోపణలు చేసిన మాజీ టీటీడీ బోర్డు చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి భక్తులకు క్షమాపణ చెప్పాలని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ డిమాండ్ చేశారు. ఆదివారం ఆమె స్థానిక టీడీపీ నాయకులతో కలిసి మీడియాతో మాట్లాడారు. తిరుమల పవిత్రత దెబ్బతినేలా భూమన మాట్లాడడం మంచి పద్ధతి కాదన్నారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన అనంతరం తిరుమలలో ప్రక్షాళన ప్రారంభించి భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తుంటే అసత్య ఆరోపణలు చేయడం తగదన్నారు. కార్యక్రమంలో జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి సుధాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఆకుతోట రమేష్, అలవల శ్రీనివాసులు, శ్రీధర్, కొండల్‌రావు, బీజేపీ నాయకుడు తాటిపర్తి ఆదినారాయణ రెడ్డి పాల్గొన్నారు.

కష్టపడే వారికి న్యాయం జరగడం లేదు

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నియోజకవర్గంలో కష్టపడే టీడీపీ నాయకులు, కార్యకర్తలు, బూత్, క్లస్టర్ ఇన్‌చార్జిలకు న్యాయం జరగడంలేదని ఆ పార్టీ నేత అప్పాడి సుబ్బరాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విషయాన్ని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌రావు దృష్టికి తీసుకెళ్లామన్నారు.

అన్నదానం

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బజారు వీధిలో వెలిసిన రామమందిరంలో వైభవంగా శ్రీరామనవమి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం టీడీపీ నాయకులు, నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ 786 రఫీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. అంతకుముందు రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బాబు, చేవూరు చెంగయ్య, ఆర్యవైశ్య సంఘం నాయకులు కోట వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

